


## ముస్తాబాద్‌లో ఘనంగా రాజా బహదూర్ వెంకట్రాంరెడ్డి విగ్రహావిష్కరణ

**ముస్తాబాద్, ఆగస్టు 22 (ప్రజా జ్యోతి):**

157వ జయంతి సందర్భంగా ఘన నివాళులు సేవలను కొనియాడిన ప్రముఖులు రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో రాజా బహదూర్ వెంకట్రాంరెడ్డి 157వ జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మిగతా 2 లో

ప్రజాజ్యోతి
కరీంనగర్
రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి
ఆదివారం 23 ఆగస్టు 2026 www. praja jyothi news.com పేజీలు:15

# రైస్ మిల్లు యజమానుల మాయాజాలం..!

- మొదట డిఫాల్ట్ లిస్టులో 143 మిల్లులు..
- ఇప్పుడు మిగిలింది 38- రూ.238 కోట్ల సీఎంఆర్ బకాయిలు- తెలంగాణ ఆవిర్భావం నుంచి సాగిన తంతు- ఆలస్యంగా మేల్కొన్న అధికారులు- క్రిమినల్ కేసులు.. పలువురు అరెస్ట్- బకాయిల వసూళ్లపై కొరడా ఝుళిపిస్తున్న ప్రభుత్వం



**పెద్దపల్లి ప్రతినిధి, ఆగస్టు 22, ప్రజాజ్యోతి:**

ప్రభుత్వం ఇచ్చిన ధాన్యం.. మిల్లర్ల చేతుల్లోకి వెళ్లింది.. బియ్యంగా మార్చి తిరిగి ప్రభుత్వానికి చేరాల్సింది. కానీ సంవత్సరాలు గడిచినా సీఎంఆర్ రూపంలో ప్రభుత్వానికి చేరాల్సిన బియ్యం మాత్రం గోదాములకు చేరలేదు. బకాయిలు పేరుకుపోయాయి.. లెక్కలు తేల్చేసరికి కోట్ల రూపాయల వ్యవహారం బయటపడింది. పెద్దపల్లి జిల్లాలో రైస్ మిల్లర్ల సీఎంఆర్ బకాయిల వ్యవహారం ఇప్పుడు ప్రభుత్వ యంత్రాంగానికి సవాల్‌గా మారింది. ఒకప్పుడు 143 మిల్లులు డిఫాల్ట్ జాబితాలో ఉండగా, కఠిన చర్యలు ప్రారంభించిన తర్వాత 105 మిల్లుల నుంచి రూ.292.89 కోట్ల విలువైన సీఎంఆర్ బకాయిలను రికవరీ చేశారు. అయినా ఇంకా 38 మిల్లుల నుంచి ఏకంగా రూ.238.53 కోట్ల విలువైన బకాయిలు రావాల్సి ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

మిగతా 2 లో

# డీ-అడిక్షన్ కేంద్రాల ఏర్పాటుకు సహకరించాలి



- అర్హత కలిగిన స్వచ్ఛంద సంస్థల నుంచి దరఖాస్తుల ఆహ్వానం
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి, ప్రతినిధి ఆగస్టు- 22 ప్రజా జ్యోతి;**

పెద్దపల్లి జిల్లాలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న జాతీయ మాదకద్రవ్య డిమాండ్ తగ్గింపు కార్యాచరణ పథకం కింద జిల్లా డీ-అడిక్షన్ కేంద్రాల ఏర్పాటు, నిర్వహణకు అర్హత కలిగిన స్వచ్ఛంద సంస్థల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మిగతా 2 లో

# రైస్ మిల్లు యజమానుల మాయాజాలం..!

మొదటిపేజీ తరువాయి

### తెలంగాణ ఆవిర్భావం నుంచి బకాయిల బాట

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి పెద్దపల్లి జిల్లాలో సీఎంఆర్ వ్యవహారం అనేక మలుపులు తిరుగుతూ వచ్చింది. ఖరీఫ్, రబీ సీజన్లలో రైతుల నుంచి ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు అప్పగించి, నిర్దేశిత నిబంధనల ప్రకారం బియ్యంగా మార్చి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) రూపంలో తిరిగి ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంటుంది.అయితే కొంతమంది మిల్లర్లు నిర్ణీత గడువులో సీఎంఆర్ ఇవ్వకుండా కాలయాపన చేస్తూ రావడంతో బకాయిలు క్రమంగా పెరిగాయి. గడువులు పొడిగించడం, వాయిదాలు వేయడం వంటి పరిణామాలతో మిల్లర్ల వద్ద సీఎంఆర్ బకాయిలు పేరుకుపోయినట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి.

### రూ.531 కోట్లకుపైగా బకాయిలు..!

సీఎంఆర్ బకాయిలపై ప్రభుత్వం దృష్టి సారించి పాత లెక్కలను బయటకు తీయడంతో పరిస్థితి తీవ్రత వెలుగులోకి వచ్చింది. ఒక దశలో 143 రైస్ మిల్లులు డిఫాల్ట్ జాబితాలో ఉండగా, వాటి నుంచి ప్రభుత్వానికి రావాల్సిన సీఎంఆర్ విలువ సుమారు రూ. 531.43 కోట్లుగా నమోదైంది.ఇందులో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడం, రికవరీ చర్యలు చేపట్టడంతో ఇప్పటివరకు 105 మిల్లుల నుంచి రూ. 292.89 కోట్ల విలువైన బకాయిలను రికవరీ చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి.
అయితే లెక్కలు ఇక్కడితో ముగియలేదు.

### ఇంకా 38 మిల్లులు.. రూ.238.53 కోట్ల బకాయిలు

ప్రస్తుతం 38 రైస్ మిల్లులు 100 శాతం సీఎంఆర్ బకాయిలతో పెండింగ్‌లో ఉన్నాయి. ఈ మిల్లుల నుంచి ప్రభుత్వానికి ఇంకా రూ. 238.53 కోట్ల విలువైన బకాయిలు రావాల్సి ఉంది.
అంటే డిఫాల్ట్ జాబితాలో ఉన్న మిల్లుల్లో అధికశాతం నుంచి రికవరీ జరిగినప్పటికీ, మిగిలిన కొద్దిమంది మిల్లర్ల వద్దే భారీ మొత్తంలో సీఎంఆర్ బకాయిలు నిలిచిపోయాయి. దీంతో ప్రభుత్వం మిగిలిన బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించింది.

### క్రిమినల్ కేసులతో ఉక్కుపాదం

బకాయిల వసూళ్లకు ప్రభుత్వం కఠిన చర్యలకు దిగింది. సీఎంఆర్ చెల్లింపుల్లో నిర్లక్ష్యం వహించిన మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు, అవసరమైన చోట అరెస్టులు కూడా చేపట్టారు.
ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న 38 మిల్లుల్లో ఏడు మిల్లులపై ఇప్పటికే క్రిమినల్ కేసులు నమోదైనట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. మిగిలిన మిల్లుల నుంచి కూడా నిర్దేశిత గడువులో బకాయిలను రికవరీ చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయి.

### రెండు మిల్లులు.. రూ.26 కోట్ల బకాయిలు

సుల్తానాబాద్ మండలం సుగ్లాంపల్లికి చెందిన సాయి మహాలక్ష్మి రైస్ మిల్లుపై సుమారు రూ. 19 కోట్ల సీఎంఆర్ బకాయి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అదే ప్రాంతానికి చెందిన సౌభాగ్య లక్ష్మి రైస్ మిల్లు నుంచి సుమారు రూ. 7 కోట్ల బకాయి ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి.ఈ రెండు మిల్లుల యాజమాన్యం ఒకటేనని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో సంబంధిత యాజమాన్యంపై పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకునే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

### విజిలెన్స్ నిఘా.. వరుస తనిఖీలు

సీఎంఆర్ బకాయిల వ్యవహారంలో ప్రభుత్వం అప్రమత్తం కావడంతో విజిలెన్స్ అధికారులు కూడా రంగంలోకి దిగారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు రైస్ మిల్లుల్లో తనిఖీలు నిర్వహిస్తూ రికార్డులు, నిల్వలు, సీఎంఆర్ డెలివరీ వివరాలను పరిశీలిస్తున్నారు.కరీంనగర్ విజిలెన్స్ డీఎస్పీ సీతారెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు కొనసాగుతున్నట్లు సమాచారం. తనిఖీల సందర్భంగా అక్రమాలు లేదా నిబంధనల ఉల్లంఘనలు గుర్తించిన చోట కేసులు నమోదు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

### ఆలస్యంగా మేల్కొన్నా.. కొరడా ఝుళిపిస్తున్న ప్రభుత్వం

సీఎంఆర్ బకాయిల వ్యవహారంలో ప్రభుత్వ యంత్రాంగం గతంలోనే కఠినంగా వ్యవహరించి ఉంటే ఇంత భారీ మొత్తంలో బకాయిలు పేరుకుపోయేవి కావనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సంవత్సరాల తరబడి బకాయిలు పేరుకుపోయిన తర్వాత ఇప్పుడు అధికారులు లెక్కలు తేల్చి, రికవరీకి దిగడం చర్చనీయాంశంగా మారింది.అయితే ప్రస్తుతం ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన చర్యలతో ఇప్పటికే రూ. 292.89 కోట్ల విలువైన బకాయిలు రికవరీ కావడం కొంత ఊరటనిచ్చే అంశంగా కనిపిస్తోంది. మరోవైపు రూ. 238.53 కోట్ల బకాయిలు ఇంకా పెండింగ్‌లో ఉండటంతో ఈ వ్యవహారంపై ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.సీఎంఆర్ ధాన్యం మాయం కాకుండా.. ప్రభుత్వానికి రావాల్సిన ప్రతి గింజ లెక్క తేల్చే వరకు చర్యలు కొనసాగుతాయా? లేక మళ్లీ వాయిదాల పర్వమే కొనసాగుతుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

### సెప్టెంబర్ 15 డెడ్‌లైన్..! ... జిల్లా పౌరసరఫరా శాఖ మేనేజర్ ముప్పిడి శ్రీకాంత్

ప్రస్తుతం సీఎంఆర్ పెండింగ్‌లో ఉన్న మిల్లర్లు సెప్టెంబర్ 15లోగా బకాయిలను చెల్లించకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్టు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ముప్పిడి శ్రీకాంత్ ప్రజా జ్యోతి కి తెలిపారు. ఒక యజమానిపై రెండు ఆ పైన కేసులు ఉంటే పీడియాక్ నమోదు కూడా వెనకాడబోమని ఇప్పటికే ఒక మిల్లును గుర్తించినట్టు ఆయన వివరించారు.దీంతో మిగిలిన 38 మిల్లర్లలో ఆందోళన మొదలైంది. ఇప్పటివరకు వాయిదాలతో కాలం గడిపిన మిల్లర్లకు ఇకపై ప్రభుత్వం నుంచి ఉపశమనం ఉండదనే సంకేతాలు వెలువడుతున్నాయి.

- దొమ్మటి రాజేష్

# ముస్తాబాద్‌లో ఘనంగా రాజా బహదూర్ వెంకట్రాంరెడ్డి విగ్రహావిష్కరణ

మొదటిపేజీ తరువాయి



మండల రెడ్డి సంఘం అధ్యక్షులు కుంభాల మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే తాడిపత్రి జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉచ్చిడి మోహన్‌రెడ్డి, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై రాజా బహదూర్ వెంకట్రాంరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు.అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. విగ్రహదాత ఏల్ల బాల్రెడ్డిని ముఖ్య అతిథులు అభినందించారు. అనంతరం ఏఎంఆర్ గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో రాజా బహదూర్ వెంకట్రాంరెడ్డి అందించిన సేవలను ప్రముఖులు కొనియాడారు.రాజా బహదూర్ వెంకట్రాంరెడ్డి తెలంగాణ చరిత్రలో విశిష్ట సేవలు అందించిన పరిపాలనా దక్షుడు, విద్యావేత్త, సంఘసేవకుడని వారు పేర్కొన్నారు. హైదరాబాద్ సంస్థానంలో కొత్వాల్‌గా పనిచేస్తూ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజా సంక్షేమానికి కృషి చేశారని తెలిపారు. పేదలు, బలహీన వర్గాల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించడంతో పాటు విద్యాభివృద్ధికి, ముఖ్యంగా బాలికల విద్యకు ఆయన విశేష ప్రాధాన్యం ఇచ్చారని గుర్తుచేశారు.విద్యార్థుల కోసం రెడ్డి హాస్టల్ ఏర్పాటులో కీలకంగా సహకరించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు విద్యా అవకాశాలు కల్పించేందుకు కృషి చేశారని తెలిపారు. నిజాయితీ, క్రమశిక్షణ, ప్రజాసేవకు రాజా బహదూర్ వెంకట్రాంరెడ్డి జీవితం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు.కార్యక్రమం అనంతరం ముఖ్య అతిథులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ రెడ్డి సంఘం అధ్యక్షులు చక్రధర్‌రెడ్డి, పూర్వాణి రామలింగారెడ్డి, ఏనుగు మనోహర్‌రెడ్డి, సందుపట్ల అంజిరెడ్డి, ఆత్మకంటి చైర్మన్ రాజిరెడ్డి, ఉప సర్పంచ్ విజయరెడ్డి, మండల రెడ్డి సంఘం నాయకులు, వివిధ గ్రామాల రెడ్డి సంఘం కులబాంధవులు, తదితరులు పాల్గొన్నారు.

# డీ-అడిక్షన్ కేంద్రాల ఏర్పాటుకు సహకరించాలి

మొదటిపేజీ తరువాయి



మాదకద్రవ్యాల వినియోగాన్ని నియంత్రించడం, మాదకద్రవ్యాల బారిన పడిన వారికి చికిత్స, పునరావాసం, అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను చేపట్టేందుకు జిల్లా డీ-అడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేసి నిర్వహించేందుకు అర్హత కలిగిన స్వచ్ఛంద సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.అర్హత కలిగిన ఆసక్తిగల స్వచ్ఛంద సంస్థలు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖకు చెందిన ఈ-అనుదాన్ పోర్టల్ ద్వారా నేరుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని,కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తులు సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.దరఖాస్తులను ఈ-అనుదాన్ పోర్టల్ ద్వారా సమర్పించాలని, ఇతర వివరాల కోసం జిల్లా సంక్షేమ అధికారి, మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, పెద్దపల్లి కార్యాలయంలో పనివేళల్లో నేరుగా, 9440852495 ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించవచ్చని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రజలకు మరింత చేరువగా..

## జవాబుదారీతనంతో విధులు నిర్వహించాలి

### - గ్రామాల్లో రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలి.

### - వార్షిక తనిఖీల్లో భాగంగా గంభీరవుపేట పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.

**గంభీరావుపేట ఆగస్టు 22 (ప్రజా జ్యోతి)**

శనివారం వార్షిక తనిఖీల్లో భాగంగా గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు.ఈసందర్భంగా ఎస్పీ పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి వారు ప్రదర్శించిన ఫుట్ డ్రిల్, లాఠీ డ్రిల్లు పరిశీలించి అభినందించారు.అనంతరం స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు,పెట్రోలింగ్ నిర్వహణ, రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘా తదితర అంశాలను క్షుణ్ణంగా సమీక్షించి, ప్రజలకు అందిస్తున్న పోలీసు సేవలపై ఆరా తీసి,కేసుల విచారణలో త్వరగతిన దర్యాప్తు,సాక్ష్యాల సేకరణలో నిష్పక్షపాత దృక్పథం అవసరమని తెలిపారు.పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పనితీరు భేషుగ్గా ఉందని అభినందించారు.పోలీస్ స్టేషన్లలో డేటా నమోదు, దర్యాప్తు ప్రక్రియలో పారదర్శకత,





నేరాల నియంత్రణలో సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించేందుకు సీసీటీఎన్ఎస్ లో అందుబాటులో ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా నిరంతరం సైబర్ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారూ.దొంగతనం కేసుల ఛేదనపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నేరస్తులను పట్టుకోవడంలో అవసరమైతే ఆధునిక సాంకేతికతను వినియోగించుకొని కేసులను చేధించడంతో పాటు రికవరీ శాతం పెంచి బాధితులకు వారి సొత్తును తిరిగి అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.స్టేషన్ పరిధిలో గ్రామాల్లో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేయాలని,డయల్112కు ఫోన్ రాగానే పెట్రోలింగ్, బ్లూ కోల్ట్ సిబ్బంది సంఘటనా స్థలానికి వేగంగా చేరుకుని బాధితులకు తక్షణ సహాయం అందించాలని సూచించారు.మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై కఠినంగా వ్యవహరిస్తు, ప్రత్యేక నిఘా కొనసాగించాలని, యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ఎస్పీ గారి వెంట డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ వెంకటేష్, ఎస్.ఐ శ్రీకాంత్ , పోలీస్ సిబ్బంది ఉన్నారు.

---

## ప్రసవ సమయంలో తీవ్ర గుండె వైఫల్యం ఎక్మో పద్ధతిలో యువతికి ప్రాణదానం

### తల్లీబిడ్డలను కాపాడిన యశోద హాస్పిటల్స్ వైద్యుల బృందం

**కరీంనగర్ టౌన్ ఆగస్టు 22( ప్రజా జ్యోతి)**

ప్రసవ సమయంలో తీవ్రమైన గుండె వైఫల్యంతో పాటు కార్డియాక్ అరెస్ట్‌కు గురైన 23 ఏళ్ల యువతికి యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీలో అత్యాధునిక ఎక్మో (ఎక్స్‌ట్రాకార్పోరియల్ మెంబ్రేన్ ఆక్సిజనేషన్) చికిత్స అందించి వైద్యులు ప్రాణాలు కాపాడారు. చికిత్స అనంతరం తల్లీబిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా డిశ్చార్జ్ కావడం విశేషం.ప్రసవ సమయంలో యువతికి తీవ్రమైన గుండె వైఫల్యం ఏర్పడి పరిస్థితి విషమించింది. అనంతరం కార్డియాక్ అరెస్ట్ కూడా సంభవించడంతో ఆమెను అత్యవసరంగా యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీకి తరలించారు. అక్కడ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ దామోదర్ రెడ్డి గౌని నేతృత్వంలో వైద్య బృందం ఆమెకు అత్యాధునిక ఎక్మో చికిత్సను ప్రారంభించింది.కార్డియాలజీ, క్రిటికల్ కేర్, వాస్క్యులర్ సర్జరీ, ప్రసూతి-స్త్రీరోగ, నెఫ్రాలజీ విభాగాలకు చెందిన నిపుణులు సమన్వయంతో చికిత్స అందించారు. తీవ్రమైన గుండె వైఫల్యంతో పాటు బహుళ అవయవాలపై ప్రభావం ఉన్నప్పటికీ, ఎక్మో ద్వారా గుండె, ఊపిరితిత్తులకు అవసరమైన జీవనాధారాన్ని అందిస్తూ వైద్యులు పరిస్థితిని నియంత్రించారు. క్రమంగా యువతి ఆరోగ్యం మెరుగుపడటంతో ఎక్మో నుంచి విజయవంతంగా తొలగించారు.ఈ సందర్భంగా కరీంనగర్లో మీడియాతో డాక్టర్ దామోదర్ రెడ్డి గౌని మాట్లాడుతూ, "బహుళ అవయవ వైఫల్యంతో కూడిన అత్యంత క్లిష్టమైన ప్రసూతి కేసుల్లోఎక్మో వంటి అధునాతన లైఫ్ సపోర్ట్ వ్యవస్థలు కీలక పాత్ర పోషిస్తాయి. సరైన సమయంలో చికిత్స ప్రారంభించడం, వివిధ వైద్య విభాగాల నిపుణుల సమన్వయం రోగి ప్రాణాలను కాపాడటంలో ఎంతో ముఖ్యమైనవి" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ యశోద హాస్పిటల్ సిబ్బంది డాక్టర్ దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన పిఎసిఎస్ చైర్మన్

**ఇల్లంతకుంట ఆగస్టు 22(ప్రజా జ్యోతి)**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామంలో శనివారం రోజు సర్పంచ్ నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో పేదలకు నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇల్లంతకుంట పిఎసిఎస్ చైర్మన్ వెంకటరమణారెడ్డి లబ్ధిదారులకు కార్డులు అందజేశారు ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రేషన్ కార్డుల పంపిణీ ద్వారా నిరుపేదలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు మామిడి రాజు, ఉపసర్పంచ్ అవినాష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కనకరాజు, మాజీ సర్పంచ్ మంద సుశీల-లింగం, పంచాయతీ సెక్రెటరీ,వార్డ్ మెంబర్లు, అధికారులు లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.



## ఆర్నకొండ సింగిల్ విండో చైర్మన్ గా యెన్నం మనోహర్ ?

**చొప్పదండి, ఆగస్టు 22 (ప్రజాజ్యోతి):**



చొప్పదండి మండలం ఆర్నకొండ సింగిల్ విండో చైర్మన్ గా చిట్యాలపల్లి కి చెందిన కాంగ్రెస్ నాయకుడు యెన్నం మనోహర్ పేరు దాదాపు ఖరారు అయినట్లుగా విశ్వసనీయంగా తెలిసింది. ఈ పదవి కోసం పలువురు పోటీ పడినప్పటికీ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మనోహర్ కే అవకాశం కల్పించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. బలహీన వర్గాల నాయకుడు, స్నేహశీలి, మృదుస్వభావి, అందరినీ కలుపుకుపోయే మనస్తత్వం గల యెన్నం మనోహర్ ను నియమించాలని పార్టీ కార్యకర్తలు కూడా కోరుతుండడంతో ఎమ్మెల్యే మనోహర్ వైపే మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. అర్నకొండ సింగిల్ విండో పరిధిలో మంగళపల్లి, చిట్యాలపల్లి, రేవల్లి తదితర గ్రామాలు ఉన్నాయి. చొప్పదండి సింగిల్ విండో ను ఓసీకి కేటాయించడంతో ఆర్నకొండను బీసీకి కేటాయించాలని కృత నిశ్చయంతో మేడిపల్లి సత్యం ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. పార్టీ ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా వాటిని విజయవంతం చేసేందుకు ఎన్నం మనోహర్ కృషి చేస్తున్నారని, ఇటువంటి చిత్తశుద్ధితో పార్టీకి పనిచేసే నాయకుడికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించడం పట్ల పార్టీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో సముచిత నిర్ణయం తీసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కు కార్యకర్తలు ధన్యవాదాలు తెలిపారు.

## చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మంత్రి కావాలని తిరుమలలో మొక్కు

### - యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు నల్లాల అఖిల్

**చొప్పదండి, ఆగస్టు 22(ప్రజాజ్యోతి):**

చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం కి రాష్ట్ర మంత్రివర్గంలో మంత్రి పదవి దక్కాలని కోరుకుంటూ శనివారం యూత్ కాంగ్రెస్ చొప్పదండి మండల అధ్యక్షులు నల్లాల అఖిల్ తిరుమలలో అలిపిరి మెట్ల మార్గం ద్వారా తిరుమలేశుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అఖిల్ మాట్లాడుతూ “మా నాయకుడు మేడిపల్లి సత్యం నిత్యం ప్రజల కోసం పని చేసే నాయకుడు. ఆయన మంత్రి అయితే నియోజకవర్గం విద్య, వైద్యం, రోడ్లు, ఉపాధి రంగాలలో మరింత వేగంగా అభివృద్ధి చెందుతుంది. సత్యం కు మంత్రి పదవి రావాలని ఆ వెంకటేశ్వర స్వామిని మనస్ఫూర్తిగా వేడుకున్నాను“ అని తెలిపారు. సత్యం నాయకత్వంలో చొప్పదండి మరింత అభివృద్ధి పథంలో నడుస్తుందని ఆకాంక్షించారు.



## పి ఏ సి ఎస్ చైర్మన్ ను సన్మానించి న రెడ్డి సంఘం సభ్యులు

**ఇల్లంతకుంట ఆగస్టు22 (ప్రజా జ్యోతి)**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల పి ఏ సి ఎస్ చైర్మన్ ఉట్కూరి వెంకటరమణ రెడ్డి నీ శనివారం రోజు ఇల్లంతకుంట రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు సంగభవనంలో ఘనంగ సన్మానించారు ఛైర్మంతో పాటు డైరెక్టర్లను



సన్మానించారు ఈ సందర్భంగా చైర్మన్ వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఏం ఎల్ ఏ సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలియజేసారు తను నిరంతరం రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు తనను సన్మానించిన రెడ్డి కులబంధవులకు కృతజ్ఞతలు తెలుపుతూ వారికి ఎల్లవేళల అందుబాటులో ఉంటూ సంగబివృద్ధికి కృషిచేస్తానన్నారు ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం సిరిసిల్ల కార్యవర్గ సభ్యులు కంకణాలు శ్రీనివాసరెడ్డి ఇల్లంతకుంట రెడ్డి సంఘం అధ్యక్షుడు గుర్రం రవీందర్ రెడ్డి చిట్టి కృష్ణారెడ్డి కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి కంది శ్రీనివాస్ రెడ్డి కంది రాజిరెడ్డి కట్ట నరసింహా రెడ్డి తుంకుంట రాజేందర్ రెడ్డి సింగిరెడ్డిఎల్లారెడ్డి కంకణాల రాంప్రసాద్ రెడ్డి మహేందర్ రెడ్డి వివిదగ్రామాల రెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఎస్సీ సెల్ ముస్తాబాద్ మండల అధ్యక్షుడిగా నియామకానికి కృతజ్ఞతలు



**ముస్తాబాద్, ఆగస్టు 22 (ప్రజా జ్యోతి):**

ముస్తాబాద్ మండలంలో నిర్వహించిన ఎస్సీ సెల్ సమావేశంలో పాల్గొన్న ఎస్సీ సోదరులందరికీ, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.నన్ను ఎస్సీ సెల్ ముస్తాబాద్ మండల అధ్యక్షుడిగా నియమించేందుకు సహకరించిన గౌరవనీయులు మంత్రి పొన్నం ప్రభాకర్ కి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కి, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు సంగితం శ్రీనివాస్ కి, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి కి, సిరిసిల్ల జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పండుగ ప్రదీప్ కి, సీనియర్ కాంగ్రెస్ నాయకులకు, మండల కాంగ్రెస్ నాయకులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.ఎస్సీ సోదరులకు ఏవైనా సమస్యలు, అవసరాలు ఎదురైనప్పుడు వారి తరఫున ముందుండి పనిచేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తానని తెలియజేస్తున్నాను.నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి, ఎస్సీ సెల్ కుటుంబ సభ్యులందరికీ మరోసారి హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ఎస్సీ సోదరుల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తాను.

## సుల్తానాబాద్‌లో యూట్యూబ్ యాక్టర్ రితిక సందడి

**సుల్తానాబాద్ ఆగస్టు 22( ప్రజా జ్యోతి)**

రాఖీ పండుగ సందర్భంగా వీడియో చిత్రీకరణ కోసం యూట్యూబ్ యాక్టర్ రితిక శనివారం సుల్తానాబాద్‌లో సందడి చేశారు. పట్టణంలోని ఓ స్వీట్‌షాప్‌కు చేరుకున్న ఆమె స్వీట్లు కొనుగోలు చేస్తూ రాఖీ పండుగకు సంబంధించిన సన్నివేశాల్లో పాల్గొన్నారు. ‘లో ఊరోల్ల’ యూట్యూబ్ ఛానల్ కోసం ఈ వీడియోలను చిత్రీకరించారు. రితిక స్వీట్‌షాప్‌కు రావడంతో స్థానికులు ఆసక్తిగా గమనించారు. ఆమెతో ఫొటోలు దిగేందుకు పలువురు అభిమానులు ఉత్సాహం చూపారు. కార్యక్రమంలో డైరెక్టర్ రాకేష్, హీరో రమేష్, డీపీఓ రాహుల్, నటుడు సాయి తేజ తదితరులు పాల్గొన్నారు. రాఖీ పండుగ నేపథ్యంలో సుల్తానాబాద్‌లో చిత్రీకరణ జరగడం స్థానికంగా సందడి నెలకొల్పింది.



## విధుల్లో నిర్లక్ష్యం తాసిల్దార్ సుజాత సస్పెన్షన్

**ఎల్లారెడ్డిపేట ఆగస్టు 22(ప్రజా జ్యోతి)**



ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని తాసిల్దార్ విధుల్లో నిర్లక్ష్యపు కారణంగా అలసత్వాన్ని ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపడంలో అనాసక్తి వ్యవహరించిన ఎల్లారెడ్డిపేట మండల తాసిల్దార్ ను వెంటనే సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు ఇచ్చిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాస్ రెడ్డి భూ సర్వే పై ఎంతవరకు వచ్చిందని తాసిల్దారు మేడంను అడగగా తడబడుతూ సమాధానం చెప్పడంతో విధులపై అలసత్వం వహించిన ఇంతవరకు ఉపేక్షించేది లేదు వెంటనే సస్పెండ్ చేయాలని ఆదేశాలు కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు సైతం రోజుల తరబడి నిరీక్షించే విధంగా నిర్లక్ష్యం వహించేవారు అని స్థానికులు చర్చించు కుంటున్నారు.

ప్రజాజ్యోతి
ఆదివారం 23 ఆగస్టు 2026



# ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

## - మండల అధ్యక్షుడిగా అక్కెనపల్లి సురేష్ మాదిగ

**కొనరావుపేట, ఆగస్టు.22(ప్రజాజ్యోతి)**

మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు కోనరావుపేట మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఇన్‌చార్జి ఎలగందుల బిక్షపతి మాదిగ,ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి పుట్ట రవి ,మాదిగ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పుట్ట రవి మాదిగ మాట్లాడుతూ... మత దురహంకారం, కుల వివక్ష, సాంఘిక అసమానతలు లేని సమ సమాజ నిర్మాణం కోసం ఎమ్మార్పీఎస్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ప్రజా సమస్యలను గుర్తించి ఉద్యమాలు నిర్మించాలని, మహనీయుల వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. నూతన తరాన్ని ఉద్యమంలోకి తీసుకొచ్చి శక్తివంతమైన సైన్యంగా తీర్చిదిద్దేందుకు నాయకులు, కార్యకర్తలు శ్రమించాలన్నారు. ఎమ్మార్పీఎస్ కోనరావుపేట మండల అధ్యక్షుడిగా అక్కెనపల్లి సురేష్ మాదిగ, అధికార ప్రతినిధిగా మెర్గు వెంకటేష్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా ముత్యం రాజు మాదిగ, ప్రధాన కార్యదర్శిగా కుమ్మరి రవి మాదిగ, కార్యదర్శిగా తాండ్ర ప్రతాప్ మాదిగలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అవునూరి ప్రభాకర్ మాదిగ, ఖానాపూర్ లక్ష్మణ్ మాదిగ, ఆవునూరి లచ్చన్న మాదిగ, శోభ రాణి మాదిగ, తర్రె శంకర మాదిగ, గజ్జల అశోక్ మాదిగ, ఎగ్లాస్‌పూర్ సర్పంచ్ పసుల పోచయ్య మాదిగ, వివిధ గ్రామాల అధ్యక్షులు,తదితరులు పాల్గొన్నారు.

# రేపు రాజన్న సిరిసిల్ల జిల్లాలో కేంద్ర మంత్రి బండి సంజయ్ పర్యటన

## - సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నూతన బీజేపీ కార్యాలయ భవన శంకుస్థాపన- వేములవాడ మున్నూరు కాపు అన్నదాన సత్రంఅదనపు గదుల ప్రారంభోత్సవం

**వేములవాడ,ఆగస్ట్,22:ప్రజాజ్యోతి.**




కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ రేపు రాజన్న సిరిసిల్ల జిల్లాలో విస్తృతంగా పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలో మరియు వేములవాడ పట్టణంలో నిర్వహించే పలు కీలక కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. పర్యటన వివరాల్లోకి వెళ్తే, రేపు ఉదయం 9:00 గంటలకు సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని రగుడు 1వ వార్డు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పక్కన నూతనంగా నిర్మించతలపెట్టిన భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయ భవన శంకుస్థాపన మహోత్సవంలో కేంద్ర మంత్రి పాల్గొంటారు. భూమిపూజ నిర్వహించి, పార్టీ కార్యాలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుడతారు.అనంతరం ఉదయం 10:00 గంటలకు వేములవాడ పట్టణ కేంద్రానికి చేరుకుంటారు. అక్కడ శ్రీ రాజరాజేశ్వర మున్నూరు కాపు నిత్య అన్నదాన సత్రం భవనానికి సంబంధించి నూతనంగా నిర్మించిన అదనపు గదులను బండి సంజయ్ ప్రారంభించనున్నారు. ఈ రెండు ముఖ్యమైన కార్యక్రమాలకు పార్టీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, వివిధ మోర్చాల బాధ్యులు, సీనియర్ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి కోరారు. ఉదయం నుంచే నిర్వహించే ఈ కార్యక్రమాలకు నాయకులు, కార్యకర్తలు సమయపాలన పాటించి నేరుగా పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మున్నూరు కాపుసత్రం అదనపు గదుల ప్రారంభోత్సవ ఆహ్వానం

## - వ్యవస్థాపక అధ్యక్షులు, కొం డా. దేవయ్య

**వేములవాడ,ఆగస్టు,22:ప్రజాజ్యోతి.**

వేములవాడపట్టణంలోని శ్రీ రా జరాజేశ్వరి మున్నూరుకాపు స త్రం గత 18 సంవత్సరాల క్రితం ప్రారంభించి 14సంవత్సరాలుగా నిర్వి రామముగా మున్నూరు కాపుకుల బాంధవులకు కులసోదరులకు సేవలు అందించు చున్నాది. ఉదయం 11గంటలకు అదనము గదులు ప్రారంభోత్సవంకేంద్రమంత్రి ,బండి. సంజయ్, ప్రభుత్వవిప్, వేములవాడ ఎమ్మెల్యే ,ఆది. శ్రీనివాస్, చేతులమీదుగా ఆదివారం రోజున ప్రారంభించబడును. ఉదయం 10గంటలకు, శివకళ్యాణం జరుగును. సత్రం వ్యవస్థాపక అధ్యక్షులు కొండదేవయ్య మాట్లాడుతూ అందరూ వచ్చి ఆశీర్వదించాల నిసకాలంలో హాజరు కావాలని కోరారు.






# పదో వార్డులో విద్యార్థులకు ఉచిత షూస్ పంపిణీ

**సుల్తానాబాద్: ఆగస్టు 22(ప్రజా జ్యోతి)**

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఉచిత షూస్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు దర్గానగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు షూస్ పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత విద్యార్థులకు షూస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



# మానవతను చాటుకున్న గాయత్రి విద్యాసంస్థల విద్యార్థులు

**పెద్దపల్లి, ప్రతినిధి ఆగస్టు 22 ప్రజా జ్యోతి:**

బసంత్‌నగర్ సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెద్దపల్లి జిల్లా చీకురాయికి చెందిన పింకాశి సతీష్ కుటుంబానికి గాయత్రి విద్యాసంస్థల విద్యార్థులు అండగా నిలిచారు. గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ సతీష్ కుటుంబాన్ని పరామర్శించి, ఆయన భార్య, కుమారుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గాయత్రి విద్యానికేతన్, గాయత్రి జూనియర్ కళాశాల, గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థులు సేకరించిన రూ.32 వేల విరాళాన్ని చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ చేతుల మీదుగా పింకాశి సతీష్‌కు అందజేశారు.ఈ సందర్భంగా సతీష్ భార్య, కుమారుడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, కుటుంబానికి మరింత ఆర్థిక సహాయం అవసరమని తెలిపారు. దాతలు, సేవా సంస్థలు ముందుకు వచ్చి ఆర్థికంగా సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గాయత్రి విద్యాసంస్థల విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# 8వ వార్డులో విద్యుత్ సమస్యల పరిష్కరించాలి

**సుల్తానాబాద్: ఆగస్టు 22 (ప్రజా జ్యోతి)**

8వ వార్డులో నెలకొన్న లోవోల్టేజీ సమస్యను పరిష్కరించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అడ్డుగా ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్‌ను వెంటనే షిఫ్టింగ్ చేయాలని కౌన్సిలర్ చింతల రాజు కోరారు. శనివారం విద్యుత్ ఏఈ కిషోర్‌తో కలిసి వార్డులో సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలించి వివరించారు. సమస్య పరిష్కారానికి 15 రోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని, 11 కేవీ లైన్ షిఫ్టింగ్ పనులను ఆదివారం నుంచి ప్రారంభిస్తామని ఏఈ హామీ ఇచ్చినట్లు కౌన్సిలర్ తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది, వార్డు ప్రజలు, ఇందిరమ్మ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# అన్నపూర్ణమ్మ ఫౌండేషన్‌లో ఘనంగా పుట్టినరోజు వేడుకలు

**ముస్తాబాద్, ఆగస్టు 22 (ప్రజా జ్యోతి):**

గూడెం గ్రామంలో అన్నపూర్ణమ్మ ఫౌండేషన్‌కు శనివారం రోజున బైరి నరేష్ భార్య సుజాత , వారి పిల్లలు విచ్చేశారు. తమ కుమారుడి పుట్టినరోజు సందర్భంగా ఫౌండేషన్‌లోని వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు భోజనం వడ్డించి, వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. పుట్టినరోజును వృద్ధుల మధ్య జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. అన్నపూర్ణమ్మ ఫౌండేషన్ ద్వారా వృద్ధులకు అందుతున్న సేవలను అభినందిస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. వృద్ధుల పట్ల ప్రేమ, ఆప్యాయతతో అన్నదానం నిర్వహించిన బైరి నరేష్ కుటుంబ సభ్యులను ఫౌండేషన్ నిర్వాహకులు అభినందించారు.





# పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో విజయవంతంగా యూరాలజీ శస్త్రచికిత్సలు

**పెద్దపల్లి ప్రతినిధి, ఆగస్టు 22 ప్రజా జ్యోతి:**

పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో రెండు క్లిష్టమైన యూరాలజీ శస్త్రచికిత్సలను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. చందపల్లి గ్రామానికి చెందిన 59 ఏళ్ల మహిళ మూత్ర విసర్జన సమయంలో మంటతో జిల్లా ఆసుపత్రికి రాగా, వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఎడమ కిడ్నీలో దీర్ఘకాలంగా రాళ్లు ఉండటంతో కిడ్నీ పనితీరు పూర్తిగా దెబ్బతిన్నట్లు గుర్తించారు. దీంతో భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ాావట్ చీవజూస్త్రతీవష్‌శీఎఎ శస్త్రచికిత్స ద్వారా పనిచేయని కిడ్నీని విజయవంతంగా తొలగించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.



అదేవిధంగా నిమ్మనపల్లి గ్రామానికి చెందిన 46 ఏళ్ల మహిళకు నెల రోజుల క్రితం కిడ్నీలో రాళ్లు ఉండటంతో ఐజీ ాేవత్ అమర్చారు. తాజాగా ఆమెకు ఐజీ ాేవత్ =వఎశీఋశ్రీ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారు. ఈ రెండు శస్త్రచికిత్సల్లో యూరాలజిస్ట్ డాక్టర్ సంతోష్ రెడ్డి, జనరల్ సర్జన్ డాక్టర్ సాయి ప్రసాద్, డాక్టర్ రాము, అనస్తీషియా వైద్యులు డాక్టర్ భవాని, డాక్టర్ స్వాతి, డాక్టర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు. శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందంతో పాటు ఓటీ సిబ్బందిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు.
ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో అందుబాటులోకి వస్తున్న అధునాతన వైద్య సేవలను



జిల్లా ప్రజలు, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.

# ఆయిల్‌పామ్‌తో రైతుల ఆదాయం పెరుగుతోంది

**- జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్యాం ప్రసాద్**

**పెద్దపల్లి ప్రతినిధి ఆగస్టు 22 ప్రజా జ్యోతి:**



జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుపై రైతుల్లో నమ్మకం, ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. నాలుగేళ్ల క్రితం తోటలు ప్రారంభించిన పలువురు రైతులు ప్రస్తుతం మంచి దిగుబడులు, స్థిరమైన ఆదాయం పొందుతుండటంతో ఆయిల్‌పామ్ విస్తీర్ణాన్ని పెంచుకుంటున్నారు. ఆయిల్‌పామ్ గెలలు (ఖీఖీదీం) నెలకు ఒకసారి లేదా నెలన్నర వ్యవధిలో కోతకు రావడంతో తరచూ ఆదాయం లభిస్తోందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ఖీఖీదీల ధర టన్నుకు రూ.23,488గా ఉంది. ఇప్పటికే కోతకు వచ్చిన తోటల్లో ఎకరాకు 4 నుంచి 5 టన్నుల వరకు దిగుబడి సాధిస్తున్న రైతులు ఉన్నారని అధికారులు తెలిపారు. శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు, తగిన నీరు, ఎరువులు, మల్చింగ్ తదితర చర్యలు చేపడితే 5, 6వ సంవత్సరాల్లో ఎకరాకు 6 నుంచి 8 టన్నుల వరకు దిగుబడి సాధించే అవకాశం ఉందన్నారు.
ఆయిల్‌పామ్ సాగుకు ఉద్యాన శాఖ ద్వారా మొక్కలు, డ్రిప్ ఇరిగేషన్‌కు సబ్సిడీతో పాటు తోటల ప్రారంభ దశలో నాలుగేళ్ల పాటు నిర్వహణ, అంతర పంటల సాగుకు ఎకరాకు ఏడాదికి రూ.4,200 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ తెలిపారు. జిల్లాలోని నేలలు, వాతావరణ పరిస్థితులు ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలంగా ఉన్నందున నీటి వనరులు, అనుకూల భూములు కలిగిన రైతులు ఈ పంటను సాగు చేసుకోవాలని ఆయన సూచించారు..

# కార్యకర్త పాడె మోసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



**తిమ్మాపూర్, ఆగస్టు 22 ( ప్రజాజ్యోతి ) :-**

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సుధాగోని లక్ష్మీనారాయణ గౌడ్ అంత్యక్రియలు శనివారం ఆయన స్వగ్రామంలో అశ్రునయనాల మధ్య ముగిశాయి. ఆయన అంతిమయాత్రకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ,జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం తదితరులు ఎస్ఎల్ గౌడ్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతిమయాత్రలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్వయంగా పాడె మోశారు. అంతిమయాత్రలో చివరి వరకు పాల్గొని ఎస్ఎల్ గౌడ్‌కు కన్నీటితో కడపటి వీడ్కోలు పలికారు. ఈ అంతిమ యాత్రలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే కొండూరు సత్యనారాయణ గౌడ్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండారి రమేష్, ధ్యావ శ్రీనివాస్ రెడ్డి, బండారి తిరుపతి, బొద్దు సునీల్, లింగాల శ్రీనివాస్, డీసీసీ ఉపాధ్యక్షులు కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి,నందగిరి రవీం,ద్రచారి, ప్రధాన కార్యదర్శి ముసుకు ఉపేందర్ రెడ్డి, దావు సంపత్ రెడ్డి, సహకార సంఘాల చైర్మన్లు మోరపల్లి రమణారెడ్డి, గోపు మల్లారెడ్డి, ఒగ్గు దామోదర్, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి,నాగిశెట్టి రాజయ్య,రొంటాల లక్ష్మారెడ్డి,కీసర సంపత్,గాజుల మహేష్,ఆత్మ కమిటీ చైర్మన్ చెన్నబోయిన రవి,పార్టీ నాయకులు పొట్ట శ్రీనివాస్,పోతుగంటి శ్రీనివాస్,మేడి అంజయ్య,తుమ్మనపల్లి శ్రీనివాసరావు,కుంట రాజేందర్ రెడ్డి,శ్రీగిరి రంగారావు,మామిడి అనిల్ కుమార్, పులి కృష్ణ,మర్రి ఓదెలు యాదవ్,బుధారపు శ్రీనివాస్,కందుల అశోక్ రెడ్డి,నాంపల్లి తిరుపతి,పొన్నం సత్యనారాయణ గౌడ్,మాచర్ల అంజయ్య,రెడ్డిగాని రాజు,రాములు యాదవ్,మన్మోహన్ రావు,రేవెల్లి రాజలింగం,కొరివి అరుణ్ కుమార్ తోపాటు వివిధ గ్రామాల్లో సర్పంచులు,పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# కోర్టు కేసుల పురోగతిపై పోలీస్ కమిషనర్ సమీక్ష సమావేశం

**కరీంనగర్ క్రైం, ఆగస్టు 22,(ప్రజాజ్యోతి):**



కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కోర్టు డ్యూటీ అధికారులతో పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు.కోర్టు సంబంధిత విధులు, పెండింగ్ కేసులు,సమన్లు,వారెంట్ల అమలు,పెండింగ్ ట్రయల్ కేసుల పురోగతిపై ఈ సందర్భంగా సమగ్రంగా సమీక్షించారు.సమన్లు, కోర్టు వారెంట్ల అమలు,పెండింగ్ ట్రయల్ కేసులు,ఈ–పెట్టీ కేసులు,డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు తదితర అంశాలపై అధికారులకు కమిషనర్ పలు సూచనలు చేశారు.పరిష్కారమైన కేసుల వివరాలను సంబంధిత ఆన్‌లైన్ వ్యవస్థల్లో ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు.పెండింగ్ ట్రయల్ కేసులు,వారెంట్లను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని,వారెంట్ల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.కోర్టు డ్యూటీ అధికారులు తమ పరిధిలోని కేసుల సమాచారాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ,విధుల్లో సమర్థత,ఖచ్చితత్వం,సమయపాలన పాటించాలని తెలిపారు.వారెంట్ల



అమలులో సాంకేతిక పరిజ్ఞానం,నేషనల్ ఇంటెలిజెన్స్ గ్రిడ్ వినియోగంపై అధికారులకు అవగాహన కల్పించారు.వారెంట్ల అమలులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని,చట్టబద్ధంగా అందుబాటులో ఉన్న సమాచారాన్ని అవసరమైన సందర్భాల్లో ఉపయోగించి వారెంట్ల అమలును మరింత సమర్థవంతంగా చేపట్టాలని కమిషనర్ సూచించారు.త్వరలో నిర్వహించనున్న లోక్ అదాలత్ నేపథ్యంలో పరిష్కరించదగిన కేసులను ముందుగానే గుర్తించి,వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.లోక్ అదాలత్ ద్వారా అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా సంబంధిత అధికారులు,కోర్టు డ్యూటీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# పోలీసు సంఘం నూతన కార్యవర్గానికి సత్కారం

**కరీంనగర్ క్రైం, ఆగస్టు 22,(ప్రజాజ్యోతి):**

జిల్లా పోలీసు సంఘం నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు ఏ. సతీష్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు శైలజ పీసీ, ఎం.డి. అఫ్జల్ పీసీతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ నిరంజన్ రెడ్డి ఘనంగా సన్మానించారు.శనివారం కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ లో నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సంక్షేమానికి సంఘానికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.సిబ్బంది వైద్య సదుపాయాలు,పిల్లల విద్య,ఇతర సంక్షేమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు.



# లోక్ అదాలత్ లతో సమ న్యాయం జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్

**సుల్తానాబాద్ ఆగస్టు 22( ప్రజా జ్యోతి)**

లోక్ అదాలత్ లతో ఇరు వర్గాలకు సమ న్యాయం అందుతుందని జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ అన్నారు. శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి గణేష్ మాట్లాడుతూ లోక్ అదాలత్ లలో ఇరు పక్షాల అంగీకారంతో రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవచ్చని అన్నారు. కక్షిదారులు వ్యయ ప్రయాసలకు గురికాకుండా ఇరు వర్గాలు రాజీ ద్వారా తమ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు . లోక్ అదాలత్ తీర్పులపై ఎలాంటి అప్పీలు ఉండదని తెలిపారు. అనంతరం సీనియర్ సిటిజన్లు రిటైర్డ్ ఉపాధ్యాయులు అల్లం భాగ్యలక్ష్మి- సత్యనారాయణ దంపతులతో పాటు రిటైర్ ఉపాధ్యాయులు సత్యనారాయణ, ఖాలిక్, నర్సయ్య లను జడ్జి దుర్గం గణేష్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ లోక్ అదాలత్ లో పలు క్రిమినల్ కేసులు, కుటుంబ వివాదాలు, భూమి తగాదాలు, చెక్ బౌన్స్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులకు సంబంధించి కేసులు పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో బార్



అసోసియేషన్ అధ్యక్షుడు వోడ్నాల రవీందర్, ఏజీపీ దూడం ఆంజనేయులు, సెంకడ్ క్లాస్ మెజిస్ట్రేట్ నేరెళ్ల శంకరయ్య, లోక్ అదాలత్ సభ్యులు మాడూరి ఆంజనేయులు, చీకటి సంతోష్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆవుల శివకృష్ణ, న్యాయవాదులు, పడాల శ్రీరాములు, ఆకారపు సరోత్తం రెడ్డి, కోడం అజయ్, బోయిని భూమయ్య, జోగుల రమేష్ , రుద్రారపు నర్సయ్య, మండల రమేష్ గుడ్ల వెంకటేష్, వేముల స్నేహ, మాడూరి పృథ్వీ, బొబ్బిలి శ్యామ్, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# 8వ వార్డులో విద్యుత్ సమస్యల పరిష్కరించాలి

**సుల్తానాబాద్: ఆగస్టు 22 (ప్రజా జ్యోతి)**

8వ వార్డులో నెలకొన్న లోవోల్టేజీ సమస్యను పరిష్కరించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అడ్డుగా ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్‌ను వెంటనే షిఫ్టింగ్ చేయాలని కౌన్సిలర్ చింతల రాజు కోరారు. శనివారం విద్యుత్ ఏఈ కిషోర్‌తో కలిసి వార్డులో సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలించి వివరించారు. సమస్య పరిష్కారానికి 15 రోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని, 11 కేవీ లైన్ షిఫ్టింగ్ పనులను ఆదివారం నుంచి ప్రారంభిస్తామని ఏఈ హామీ ఇచ్చినట్లు కౌన్సిలర్ తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది, వార్డు ప్రజలు, ఇందిరమ్మ లబ్ధిదారులు పాల్గొన్నారు.



# బీ.సీలవాటాతెల్చండిలిపాలాస.నరేందర్,కార్యదర్శి,తెలంగాణబి.సి,సంఘము

**వేములవాడ,ఆగస్ట్,22:ప్రజాజ్యోతి.**

బీసీల వాటా కొరకు ఎన్నో సంవత్సరాలుగా పోరాటాలు చేసినప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు న్యాన్నివేత ధోరణితో బీసీలను అన్యాయం చేయుచున్నాయి రాష్ట్రంలో దేశంలో ఉన్నత వర్గాలు ఫార్వర్డ్ క్యాస్ట్ వాల్లు ఏడు శాతం ఉండగా వారికి ఎకనామికల్ వీకర్ సెక్షన్ అనే ఒక చట్టం తెచ్చి బీసీల పొట్ట గొట్టిఅన్యాయంచేయుచున్నారు,.అ బలహీనవర్గాలకు రావాల్సిన వాటా ఇవ్వాల్సింది పోయి 33% రిజర్వేషన్ మహిళలకు అని కొత్త గళం ఎత్తుకొని కేంద్ర ప్రభుత్వం మళ్లీ ఫార్వర్డ్ క్యాస్ట్ ఉన్నత కులాలకు లబ్ధిచేకూర్చు ట కొరకు చట్టసభలలో బిల్లు పెట్టారు అందులో బీ సీ మహిళాలకు 16.5 శాతం ఇవ్వాలి.ఎలాంటి రిజర్వేషన్ బీసీలకు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం దాటవేత ధోరణితో బిల్లు పెట్ట గా ప్రతిపక్షాలు అడ్డుకోవడంతో ఆగిపోయింది .కేంద్రప్రభుత్వంలోఉన్నటువంటి బి సి ప్రధానమంత్రి బి సి కేంద్ర మంత్రులు బలహీన వర్గాలకు చెందిననాయకులుగా నినిమ్మకు నీరెత్తినట్టు ఉండడం భవి ష్యత్తరాలుకుఎనలేనిఅన్యాయము చేసినవారు అవుతారు. బీసీలు దేశవ్యాప్తంగా 60% ఉన్నప్పటికీ 42% రిజర్వేషన్ ఇస్తామని అనుడే కానీ నిజా యితీగా అమలు చేసింది లేదు చాలా కాలంగా ఎన్నో ఉద్యమా లుచేస్తున్నప్పటికీపట్టించుకున్న పాపానపోలేదుభవిష్యత్తరాలకు జవాబు చెప్పవలసిన బా ధ్యత కేంద్ర ప్రభుత్వానిదే, రా



జ్యాంగవిరుద్ధంగారిజర్వేషన్లను అక్రమంగా ఎకనామికల్ వీకర్ సెక్షన్ పెట్టి బలహీన వర్గాలను అవమానిస్తున్నారు వారికి రావలసిన ఫలాలను రాకుండా చేయుచున్నారు ఉద్యోగ రాజ కీయ విద్య రంగాలలో వెనుక బాటుతనానికిప్రస్తుతనాయకులు ముందుంటున్నారు బీసీ ఉద్యమం ఉదృతం కాకముందే న్యాయంచేయాలనికోరుచున్నాను.

# కుళ్ళిపోయి దుర్వాసనతో శునకం

## - పట్టించుకోని గ్రామ పంచాయతీ అధికారులు

**తిమ్మాపూర్,ఆగస్టు 22 (ప్రజాజ్యోతి) :-**

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్ గ్రామ పంచాయతీ పరిధి లోని ఓ ప్రవేటు ఇంజనీరింగ్ కాలేజీకి ఎదురుగ గత మూడు రోజుల క్రితం శునకం మృతి చెందగా గ్రామపంచాయతీ సిబ్బంది కి తెలిపినప్పటికీ పట్టించుకోక పోవడంతో కుళ్ళిన శునకం దుర్వాసనతో ఆ దారిలో వెళ్ళేటువంటి విద్యార్థులు ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ సిబ్బంది స్పందించి వెంటనే తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



# ప్రగతి ఫలాలు ప్రతి గడపకు అందిస్తాం: వొడితల ప్రణవ్

## - ఇంటి ఇంటికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..

## - గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి





**వీణవంక, ఆగస్ట్ 22(ప్రజాజ్యోతి )**

కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలను ప్రతి గడపకు, ప్రతి ఇంటికి అందించేందుకు కృషి చేస్తున్నామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శనివారం వీణవంక మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన ఆయన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పంపిణీ చేశారు.బేతిగల్, వల్భాపూర్, నర్సింగాపూర్, లస్మక్కపల్లి, వీణవంక, రామకృష్ణాపూర్, కొండపాక, హిమ్మత్‌నగర్, శ్రీరాములపేట, నర్సింహులపల్లి, చల్లూర్, మామిడాలపల్లి, ఎల్బాక, గంగారం, బొంతుపల్లి, ఘన్ముక్ల, మల్లన్నపల్లి తదితర గ్రామాల్లో మొత్తం రూ.19 లక్షల విలువైన 49 సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఆపద సమయంలో ప్రభుత్వం అండగా నిలిచిందంటూ లబ్ధిదారులు కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కోసం గ్రామాల్లో పర్యటిస్తున్న సమయంలో అనేక సమస్యలు తమ దృష్టికి వస్తున్నాయని, వాటి పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేస్తామని తెలిపారు. గత రెండున్నరేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఇంటికి సంక్షేమం, అభివృద్ధి అందించేందుకు పనిచేస్తోందన్నారు. అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేదలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు.

### విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం పరిశీలన

లస్మక్కపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ప్రణవ్ చిన్నారులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యత, పిల్లలకు అందుతున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విద్య, ఆరోగ్యం, భవిష్యత్‌కు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు.

### కౌశిక్‌రెడ్డి అబద్ధపు ప్రచారాలు మానుకోవాలి

డబుల్ బెడ్‌రూం ఇళ్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి పూర్తి చిత్తశుద్ధి ఉందని ప్రణవ్ అన్నారు. గతంలో మంత్రిగా, ఎమ్మెల్సీగా, విప్‌గా పనిచేసినప్పటికీ చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముందుకు తీసుకెళ్తోందని పేర్కొన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయించడంతో పాటు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. కౌశిక్‌రెడ్డి అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో కనిపించే ప్రచారానికి, వాస్తవ జీవితానికి చాలా తేడా ఉంటుందని అన్నారు. పేదలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో లబ్ధిదారులకు ఇళ్లను ఎందుకు పంపిణీ చేయలేదో సమాధానం చెప్పాలని ప్రణవ్ డిమాండ్ చేశారు.



### సీఎం విదేశీ పర్యటనకు అడ్డంకులు రాజకీయ కుట్ర

విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు వెళ్లాలని భావిస్తే అనుమతి ఇవ్వకపోవడం రాజకీయ కుట్రేనని ప్రణవ్ ఆరోపించారు. విదేశాల్లోని విద్యాసంస్థలను పరిశీలించి తెలంగాణలో విద్యార్థులకు మరింత మెరుగైన విద్య, మౌలిక వసతులు కల్పించే దిశగా సీఎం పర్యటన ఉపయోగపడేదన్నారు.తెలంగాణ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసి దేశానికి రోల్ మోడల్‌గా నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ఇలాంటి ప్రయత్నాలను అడ్డుకోవడం బీజేపీకి తగదని, రాజకీయ కుట్రలకు భయపడకుండా విద్యార్థుల భవిష్యత్ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమాల్లో వీణవంక మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రఘుపాల్‌రెడ్డి, మండల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మంథనిలో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

## - కమ్యూనిటీ కిచెన్‌లో పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి

## - 24న మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా ప్రారంభం - పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**మంథని, ఆగస్టు 22 (ప్రజాజ్యోతి):**

మంథనిలో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభానికి పకడ్బందీ ఏర్పాట్లుచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. మంథని మున్సిపాలిటీ పరిధిలోని గంగాపురి మార్కెట్ కమిటీ గోడౌన్ లో ఇస్కాన్ సంస్థ, హరే రామ హరే కృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను జిల్లా కలెక్టర్ కోయ



శ్రీహర్ష శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ గంగపురి ప్రాంతంలో ఇస్కాన్ సంస్థ, హరే రామ హరే కృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమ్యూనిటీ కిచెన్‌ను సోమవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే



ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతర అతిథులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. కమ్యూనిటీ కిచెన్‌లో వంటశాల, ఆహార తయారీ, నిల్వ, తాగునీరు, విద్యుత్, పరిశు భ్రత తదితర సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు. కిచెన్‌లో పరిశుభ్రత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, నాణ్యమైన ఆహారాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేసేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించి పార్కింగ్, భద్రత, విద్యుత్, తాగునీరు తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని, సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంథని ఆర్డీవో సురేష్, మంథని మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, తహసిల్దార్ ఆరిపోద్దిన్, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి ప్రతినిధి, ఆగస్టు 22, ప్రజాజ్యోతి:**

గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో పంచాయతీ అధికారులతో గ్రామాల్లో పరిపాలన పురోగతిపై సమీక్ష నిర్వహించారు.గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, డంపింగ్ యార్డులు, సెగ్రిగేషన్ షెడ్లను పూర్తిస్థాయిలో వినియోగించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు రోడ్లపై నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టడంతో పాటు క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలని ఆదేశించారు.అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని, నూతన పింఛన్ల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో అక్రమ నిర్మాణాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వవద్దని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టకుండా పంచాయతీ కార్యదర్శులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.సమావేశంలో ఇన్‌చార్జి జిల్లా పంచాయతీ అధికారి శ్రీమాల, డివిజనల్, మండల పంచాయతీ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# 25 వరకు చేయూత పెన్షన్ దరఖాస్తులకు అవకాశం

## - మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్

**పెద్దపల్లి ప్రతినిధి, ఆగస్టు 22, ప్రజాజ్యోతి:**

పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న 'చేయూత' పెన్షన్ పథకం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటివరకు మున్సిపల్ పరిధిలో 644 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణకు ఆగస్టు 31 వరకు గడువు ఇచ్చినప్పటికీ, చివరి దశలో సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున అర్హులైన వారు ఆగస్టు 25లోపు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను తమ వార్డు ఆఫీసర్‌కు లేదా మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ సూచించారు. దరఖాస్తు ప్రక్రియను సకాలంలో పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు.



# సినారె విగ్రహ సాక్షిగా రెడ్డి భవన్ ఆత్మ గౌరవాన్ని దెబ్బతీయొద్దు

## అసాంఘిక కార్యకలాపాలపై మండిపడ్డ మెరుపుల రాకేష్ రెడ్డి

**వేములవాడ,ఆగస్ట్,22:ప్రజాజ్యోతి.**

వేములవాడలోని నంది కామన్‌మారుపాక రోడ్డులో ఉన్న రెడ్డి భవన్ ఇటీవల అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారడంపై జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి స్వగ్రామమైన హన్మాజీపేటకు చెందిన మెరుపుల రాకేష్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు, దూరప్రాంత సందర్శకులు, రెడ్డి సమాజ బంధువుల సౌకర్యార్థం నిర్మించిన ఈ భవనం ఈ రోజు ఆత్మ గౌరవాన్ని కోల్పోవడంపై ఆయన మండిపడ్డారు. తెలంగాణ గర్వకారణమైన సినారె విగ్రహం ముందే ఇలాంటి పనులు జరగడం దురదృష్టకరమని, ఇది ఏ ఒక్కరిపైనో చేసిన వ్యక్తిగత విమర్శ కాదని, సమాజ గౌరవానికి సంబంధించిన విషయమని స్పష్టం చేశారు.'రెడ్డి భవన్' అనే పేరు వెనుక ఒక సమాజపు ఆత్మగౌరవం





దాగి ఉందని, కేవలం ధనార్జనే ధ్యేయంగా భావించి సమాజానికి తలవంపులు తెచ్చే కార్యకలాపాలు నిర్వహించడం బాధాకరమన్నారు. నిర్వాహకులు వెంటనే స్పందించి ఇలాంటి పనులకు స్వస్తి పలకాలని, లేనిపక్షంలో 'రెడ్డి భవన్' అనే పేరును తొలగించి, మా గ్రామ ముద్దుబిడ్డ ప్రపంచ సాహితీవేత్త సినారె విగ్రహాన్ని మరో గౌరవప్రదమైన ప్రదేశానికి తరలించాలని డిమాండ్ చేశారు. 'బలగం' వంటి చిత్రాల ద్వారా సంస్కృతిని చాటిన పవిత్రమైన రాజన్న నేలపై ఇలాంటి పరిస్థితులు తలెత్తడం సమంజసం కాదని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, రాజన్న ఆలయ పవిత్రతను, రెడ్డి సమాజ ఆత్మగౌరవాన్ని కాపాడాలని నిర్వాహకులను, ప్రభుత్వాన్ని కోరారు.

# తెలంగాణ ఉద్యమకారుల సమస్యలపై సమగ్ర చర్చ జరగాలి

**పెద్దపల్లి ప్రతినిధి, ఆగస్టు 22, ప్రజాజ్యోతి:**

తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి బలమైన విధానం రూపొందించడంతో పాటు ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టీపీఎఫ్) పెద్దపల్లి జిల్లా కమిటీ కోరింది. ఈ నెల 23న వరంగల్ ప్రెస్ క్లబ్, హన్మకొండలో నిర్వహించనున్న బహిరంగ చర్చా వేదికకు సంబంధించిన కరపత్రాలను శనివారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గుమ్మడి కొమురయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో విద్యార్థులు, యువత, ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు చేసిన త్యాగాలు చారిత్రాత్మకమన్నారు. ఉద్యమకారుల హక్కులు, నిరుద్యోగ యువత సమస్యలు, ఖాళీ ఉద్యోగాల భర్తీ, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం సమగ్ర దృష్టి సారించాలని కోరారు.రాష్ట్ర కార్యదర్శి గాండ్ల మల్లేశం మాట్లాడుతూ ఆదివారం ఉదయం 11 గంటలకు జరిగే బహిరంగ చర్చా వేదికకు ఉద్యమకారులు, నిరుద్యోగులు, విద్యార్థులు, మేధావులు, ప్రజాసంఘాల ప్రతినిధులు హాజరై తమ అభిప్రాయాలు వెల్లడించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పులిపాక రవీందర్



మాట్లాడుతూ ఉద్యోగాలు, ఇళ్ల స్థలాలు, ఖాళీ పోస్టుల భర్తీ, ప్రభుత్వ ఉద్యోగ వ్యవస్థ బలోపేతం తదితర అంశాలపై చర్చ జరుగుతుందని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కంపల్లి అంజన్న, కె.రాజు, రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముడిమడుగుల మల్లన్న, సామాజిక ఉద్యమకారులు రామిల్ల బాపు, మంచినీళ్ల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాలు మై వేములవాడ సేవా ట్రస్ట్

**వేములవాడ,ఆగస్ట్,22:ప్రజాజ్యోతి.**

ట్రస్టు ఆధ్వర్యంలో దాతల సహకారంతో 1960 రోజులుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా శనివారం రోజున స్థానిక భీమేశ్వర రాజన్న ఆలయం వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. నేటిఅన్నదాత లుగా ఇప్పపూల.ఈశ్వర్ జయంతి సందర్భంగా వీరి సతీమణి సుప్రజ వీరి అమ్మ అంజమ్మ అన్నయ్య వదినలు ఇప్పపూల వినోద్, పద్మ దంపతులు, ఇప్పపూల.అజయ్,మమత దంపతుల ఁకుటుంబ సభ్యులు, ఇమ్మరోజు మురళి జ్ఞాపకార్థం వీరి కుమారుడు కోడలు మహేందర్ కవిత దంపతులు కుటుంబసభ్యులు హైదరాబాద్ వాస్తవ్యులు బద్దిపూర్ శ్రీమతి పుట్టినరోజు సందర్భంగా వీరి భర్త రమేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా వాసాల రవీందర్ భూలక్ష్మి దంపతులు అన్నదానం చేశారు పుట్టినరోజు పెళ్ళిరోజు, ఇతరత్ర కార్యక్రమాలకు పేదలకు ఒక్క పూట అన్నదానం చేయలనుకునే దాతలు ట్రస్టు సభ్యులను గాని ట్రస్ట్ నంబరు 9246939388 కు సంప్రదించాలని



ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ కోరారు.నేటి కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మధు మహేష్ సగ్గు రాహుల్ పసుల శ్రీధర్ సీనియర్ పాత్రికేయులు గొట్టె మనోహర్ రాజేశ్వరి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి

## - బిజెపి ఆధ్వర్యంలో నిమ్మ పెల్లి క్రాస్ రోడ్ వద్ద రాష్ట్ర రోకో





**కోనరావుపేట, ఆగస్టు.22(ప్రజాజ్యోతి)**

గత రెండేళ్లుగా కురిసిన అకాల వర్షాల వల్ల మరిమడ్ల, శివంగళపల్లి, వెంకట్రావుపేట,వట్టిమల్ల, వివిధ గ్రామాల రైతులు తీవ్రంగా నష్టపోయారని ఇంతవరకు నష్టపరిహారం అందలేదని కోనరావుపేట మండలం నిమ్మపెల్లి క్రాస్ రోడ్ వద్ద భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు మిర్యాల్ కార్ బాలాజీ, ఆధ్వర్యంలో రాష్ట్ర రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. ఆ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం హడావిడిగా స్థానిక అధికారులతో సమగ్ర సర్వే, చేయించి నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారని. అప్పటి నుండి బీజేపీ ఆధ్వర్యంలో తహసిల్దారుకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించిన ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేకపోవడంతో రోడ్డుపైకి వచ్చి రాస్తారోకో నిర్వహించామని తెలిపారు .అలాగే హమాలీలకు, కూలీలకు చెల్లించాల్సిన బకాయిలను కూడా ఇంతవరకు విడుదల చేయ పోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమనీ అన్నారు. ప్రభుత్వం రైతులకు నేరుగా చెల్లించాల్సిన నిధులను మధ్యలోనే తొక్కిపెట్టి కాలయాపన చేస్తుంటే, అన్నదాతల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో స్పష్టంగా అర్థమవుతోంది. అన్నారు. రైతు ఏడ్చిన రాజ్యం ఏనాడూ బాగుపడలేదనీ ప్రభుత్వం ఇప్పటికైనా నష్టపోయిన రైతన్నలకు తక్షణమే పూర్తిస్థాయి నష్టపరిహారం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆనాడు హడావిడిగా మరిమడ్ల గ్రామాన్ని సందర్శించి రైతులకు అండగా ఉంటామని వాగ్దానాలు చేసిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్,ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ఆయనపై ఎంతైనా ఉందని గుర్తుచేశారు. అన్నదాతల కడుపు కొడుతూ కాలం గడుపుతామంటే బీజేపీ చూస్తూ ఊరుకోమని ప్రభుత్వం వెంటనే మేల్కొని పరిహారం చెల్లించకపోతే, రాబోయే రోజుల్లో పోరాటాన్ని మరింత ఉధృతం చేసి ప్రభుత్వాన్ని స్తంభింపజేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శిలు బైరగుని సురేష్ గౌడ్, ఎక్కలదేవి జలందర్ యాదవ్, మండల ఉపాధ్యక్షులు ఎడ్ల సుధాకర్, చింతల పరశురాములు, చీకటి మధు, మహిళ మోర్చా మండల అధ్యక్షురాలు తీగల జయశ్రీ, సోషల్ మీడియా మండల కన్వీనర్ లంబ వేణు, నాయకులు తీగల రవీందర్ గౌడ్, చల్ల జితేందర్ రెడ్డి, కడర్ల వికాస్, అరె రేణుక,బూత్ అధ్యక్షులు దుర్ల శంకర్, పొన్నం మహేష్, చౌటుపల్లి వెంకటి, పిల్లి వెంకటేష్, వేల్పుల మైపాల్, సుదగొని సాయి కృష్ణ, జిన్నా రమేష్, జెట్టి విజయ్, భాను, అజయ్, నాయకులు కార్యకర్తలు తదిరులు పాల్గొన్నారు.

# కోనరావుపేట ఎస్సై నీ కలిసి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**కొనరావుపేట, ఆగస్టు.22(ప్రజాజ్యోతి)**

కొనరావుపేట పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన రామ్మోహన్ ను కోనరావుపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మానుక సత్యం, మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఎస్సై రామ్మోహన్ మాట్లాడుతూ మండల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ,నేరాల నివారణకు కఠిన చర్యలు చేపడతామని. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మాజీ జెడ్పి టిసి గొట్టే రుక్మిణి, సీనియర్ నాయకులు రాస రవీందర్, శ్రీధర్, సదానందం, మనోజ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# గ్రామాల వారీగా తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు

**పెద్దపల్లి, ప్రతినిధి ఆగస్టు 22 ప్రజా జ్యోతి:**

జిల్లాలో గ్రామాల వారీగా తాగునీటి సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీలో తాగునీటి సరఫరాపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి గ్రామంలో అవసరమైన పైప్‌లైన్లు, అదనపు ఓహెచ్‌ఎస్‌ఆర్‌లు, కొత్త నీటి కనెక్షన్ల వివరాలను సేకరించి సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. పంచాయతీ నిధులతో అత్యవసర చిన్నతరహా పనులను వెంటనే చేపట్టాలని, ఓహెచ్‌ఎస్‌ఆర్‌లు, పైప్‌లైన్ల లీకేజీలు, చిన్నపాటి మరమ్మతులను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. జీపీడీపీ కింద ప్రతిపాదించిన తాగునీటి పనులకు త్వరగా అనుమతులు, నిధులు మంజూరయ్యేలా నిరంతరం ఫాలోఅప్ చేయాలని జెడ్పీ సీఈఓను ఆదేశించారు. తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని స్పష్టం చేశారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ నరేందర్, మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ గంగాధర్ శ్రీనివాస్, అదనపు డీఆర్‌డీఏ అధికారి రవీందర్, ఎంపీడీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# కుల వివాదం, సోషల్ మీడియా బెదిరింపులపై ఫిర్యాదు...

**రామడుగు, ఆగస్టు 22 (ప్రజా జ్యోతి)**

సోషల్ మీడియాలో బెదిరింపులపై తమకు ప్రాణహాని ఉన్నదంటూ బాధితులు ఫిర్యాదు చేసిన ఘటన రామడుగు మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్ఐ రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామడుగు మండలం గ్రామ శివారులోని 99/అూ సర్వే నంబర్ లోని 6 ఎకరాల 36 గుంటల భూమి విషయంలో గౌడ కులస్తులు తమ పెద్దమనిషి పున్నం రామలక్ష్మి పేరున ఉన్న భూమిని గౌడ సంఘం పేరుమీద ఎఌవఱశీఅ చేయాలని తాసిల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగా ఆ భూమి తనని పేర్కొంటూ మరో వర్గం కూడా మ్యుటేషన్ చేయవద్దని తాసిల్దార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ నేపథ్యంతో గౌడ యువత వాట్సప్ గ్రూపులో ఇరు వర్గాల మధ్య వివాదాన్ని రెచ్చగొట్టే విధంగా అసభ్యకరమైన పోస్టులు చేయడంతో పాటు, పిటిషన్ను వెనక్కి తీసుకోకపోతే చంపుతామని బెదిరించారు. ఈ విషయమై ఈ విషయమై గౌడ కులస్తులు సమావేశం ఏర్పాటు చేసుకొని కొంతమంది వ్యక్తులను కుల బహిష్కరణ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంతో తమకు ప్రాణహాని ఉన్నదని మండల కేంద్రానికి చెందిన పొన్నం సత్యనారాయణ గౌడ్ తండ్రి నరసయ్య ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంలో ప్రపంచ దేశాలతో పోటీపడుతున్న తరుణంలో గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా కుల బహిష్కరణ పేరుతో మానసిక వేదనకు గురి చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్న సంఘటనలు ఇంకా జరుగుతున్నాయననానికి నిదర్శనమే ఈ వివాదం.

# ఎస్ ఐ నీ కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన ఆలయకమిటీ చైర్మన్

**ఇల్లంతకుంట ఆగస్టు 22(ప్రజా జ్యోతి)**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల ఎస్ ఐ గా బాధ్యతలు స్వీకరించిన ఉపేంద్ర చారి నీ శనివారం రోజు కందికట్కూర్ రేణుకఎల్లమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కంది రాజిరెడ్డి వైస్ చైర్మన్ కంది శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సన్మానించారు.



# అయ్యప్ప దేవాలయానికి అన్నపూర్ణ పురస్కారం

**సుల్తానాబాద్, ఆగస్టు 22 (ప్రజా జ్యోతి):**

మండల కేంద్రంలోని నీరుకుల్లా రోడ్డులో ఉన్న శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయానికి అన్నపూర్ణ ఉత్తమ సేవా పురస్కారం2026 లభించింది. హైదరాబాద్‌లోని శ్రీ త్యాగరాయ గానసభ ఆడిటోరియంలో శనివారం మహాశాస్త్ర సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పురస్కార ప్రదానోత్సవంలో పందళ రాజవంశీయులు శ్రీశ్రీ రాజ తిరునాళ్ సురేష్ వర్మ రాజా చేతుల మీదుగా ఆలయ తాంత్రి గురుస్వామి శ్రీశ్రీ కుసుమ ప్రదీప్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.



# సమన్వయంతో భూముల రీసర్వే పూర్తి చేయాలి

- భూ భారతి, సాదాబైనామా, ఎస్ఐఆర్ పై ప్రత్యేక దృష్టి సారించాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

- భూముల రీ సర్వే, భూ భారతి, సాదాబైనామా, ఎస్ఐఆర్ తదితర అంశాలపై రెవెన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి ఆగస్టు - 22( ప్రజాజ్యోతి)**



జిల్లాలో భూముల రీ సర్వే ప్రక్రియను రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.భూముల రీసర్వే ప్రక్రియ, భూ భారతి, సాదాబైనామా, ఎస్ ఐ ఆర్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అధికారులతో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. భూముల రీ సర్వే ప్రక్రియ, వివిధ అంశాలపై తహసీల్దార్లు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఇప్పటికే సర్వే చేసిన గ్రామాల రికార్డులు సంబంధిత తహసీల్దార్లకు అందజేయాలని ఆదేశించారు. భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పక్కాగా సేకరించాలని, లక్ష్యం నిర్దేశించుకుని, రీ సర్వే పూర్తి పారదర్శకతతో చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో సర్వే చేసే ముందు ఆయా భూముల సర్వే నంబర్ల వివరాలు జీపీఓలు, ఏఈఓలు, పంచాయతీ కార్యదర్శుల ద్వారా భూముల సమాచారం చేరవేయాలని తెలిపారు. గ్రామ సరిహద్దుల రీ సర్వే, ఇతర పనులను తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో నిత్యం పరిశీలించాలని సూచించారు. గ్రామ సరిహద్దుల రీ సర్వే చేసేప్పుడు అటవీ శాఖ అధికారులు పాల్గొనేలా చూడాలని ఆదేశించారు. సర్వే పూర్తి వివరాలు క్షేత్రస్థాయి, రికార్డులలో పరిశీలించిన తర్వాత మిగతా ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల గుర్తింపు, పరిరక్షణ పక్కాగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి తహసీల్దార్ తమ పరిధిలోని కార్యాలయ సిబ్బంది, సర్వే అధికారులతో భూముల రీ సర్వే, భూ భారతి, సాదాబైనామా, ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. నిబంధనలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని తెలిపారు.



కుల, ఆదాయ, ఇతర ధృవీకరణ పత్రాలు నిర్ణీత సమయంలో జారీ చేయాలని సూచించారు. ప్రత్యేక ఓటర్ సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కింద జిల్లాలో నో మ్యాపింగ్ ఓటర్లు, అనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వెల్లడించారు. షెడ్యూల్ రూపొందించి.. ప్రక్రియను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, కలెక్టరేట్ పర్యవేక్షకులు, ఆయా మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# “చిరంజీవితో నా అనుబంధం ప్రత్యేకం..

- ప్రజారాజ్యంలో కలిసి పనిచేశాం”- మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకల్లో వెలిచాల రాజేందర్‌రావు

- చిరంజీవి యువత తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు వేడుకలు

**కొత్తపల్లి / ఆగస్టు 22 ,(ప్రజా జ్యోతి)**



మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు కరీంనగర్‌లో ఘనంగా జరిగాయి. శనివారం మైత్రి హోటల్‌లో చిరంజీవి యువత తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెలిచాల రాజేందర్‌రావు కేక్ కట్ చేసి చిరంజీవి అభిమానులకు స్వీట్లు తినిపించారు. అనంతరం అభిమానులు, కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లతో కలిసి మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా రాజేందర్‌రావు మాట్లాడుతూ.. మెగాస్టార్ చిరంజీవితో తనకు ఎంతో ఆత్మీయ అనుబంధం ఉందని తెలిపారు. ప్రజారాజ్యం పార్టీలో ఉన్న సమయంలో చిరంజీవితో కలిసి పనిచేశామని, ఆ రోజుల్లో తమ మధ్య మంచి సాన్నిహిత్యం ఏర్పడిందని గుర్తుచేశారు. “చిరంజీవితో నాకు ఎంతో ఆత్మీయ అనుబంధం ఉంది. ప్రజారాజ్యం పార్టీలో కలిసి పనిచేశాం. ఆయనతో మా కుటుంబానికి కూడా మంచి అనుబంధం ఉంది” అని రాజేందర్‌రావు అన్నారు.మెగాస్టార్ చిరంజీవి సినీ రంగంలో రాబోయే రోజుల్లో మరింతగా రాణించాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. చిరంజీవి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకుంటూ మెగాస్టార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న,కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు గుమ్మడి రాజకుమార్, భాస్కర్ నాయక్, ఆకుల నందిని ఉదయ్, ఇక్రమ్ సికిందర్, కళ్లేపల్లి శారద బాలరాజు, గంటమిడిదొడ్డి కపిల్ మాధవ,గాలిపెల్లి కుమార్ శ్రీనివాసు రావనవేని సంపత్, సముద్రాల రమణారావు, జల్లోజు శ్రీనివాస్, పత్యం రాజేష్, వేముల శ్రీనివాసు, సలీం తిప్పారపు శ్రీనివాస్, కనకరాజు, కాసారపు కిరణ్ కుమార్, గండి గణేష్ రాకేష్, సలీం, కోహెడ వేణు, మీసా రమాదేవి కర్రె పావని, పోరండ్ల రమేష్ సత్తినేని శ్రీకాంత్, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఖిలావనపర్తి శివారులో అక్రమ మట్టి తవ్వకాలు

## - జేసీబీని సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు



**ధర్మారం,ఆగస్టు22 (ప్రజా జ్యోతి):**

ధర్మారం మండలం ఖిలావనపర్తి గ్రామ శివారులో ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్న జేసీబీని రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు.గ్రామ శివారులోని సర్వే నంబర్ 338లో ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా జేసీబీతో మట్టి తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నట్లు స్థానికుల నుంచి ఫిర్యాదులు అందాయి.ఫిర్యాదుల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నవీన్‌రావు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని తనిఖీ చేశారు. అక్కడ మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు గుర్తించి జేసీబీని స్వాధీనం చేసుకుని ధర్మారం తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.అనంతరం ఘటనపై పంచనామా నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు ఆర్ఐ తెలిపారు.ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టి, ఇసుక తవ్వకాలు చేపట్టడం, తరలించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.అక్రమ తవ్వకాలకు పాల్పడిన వారిపై నిబంధనల మేరకు కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

# కరీంనగర్ కార్పొరేషన్‌పై 'జెన్‌జీ వాచ్‌డాగ్' నిఘా వెలిచాల రాజేందర్‌రావు



**కరీంనగర్ బ్యూరో,ఆగస్టు 22( ప్రజాజ్యోతి )**

నగరపాలక సంస్థలో అవినీతిని అరికట్టి పారదర్శక పాలన కోసం 4050 మంది యువ లాయర్లు, ఆర్టీఐ కార్యకర్తలు, ఐటీ ప్రొఫెషనల్స్‌తో 'జెన్‌జీ విజిలెన్స్ వాచ్‌డాగ్ కమిటీ' ఏర్పాటు చేస్తున్నట్లు కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ప్రకటించారు.మైత్రి హోటల్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి పనులు, ఇంజనీరింగ్ టెండర్లు, టౌన్ ప్లానింగ్ అనుమతులపై ఆర్టీఐ ఆధారంగా నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తామని తెలిపారు. ప్రజల ఫిర్యాదుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసి, ప్రధాన చౌరస్తాల్లో వాచ్‌డాగ్ నంబర్లు ప్రదర్శిస్తామని చెప్పారు.22ఏ నిషేధిత భూముల సమస్య పరిష్కారానికి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ స్థాయిలో చర్యలు కొనసాగుతున్నాయని, త్వరలో బాధితులకు ఉపశమనం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, ప్రజల ముందు క్షమాపణ చెప్పాలని రాజేందర్‌రావు డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు గుమ్మడి రాజకుమార్, భాస్కర్ నాయక్, ఆకుల నందిని ఉదయ్ విక్రమ్ సికిందర్, కళ్లేపల్లి శారద బాలరాజు, గంట శ్రీనివా స్ గౌడ్, తిరుపతిరెడ్డి బోగొండ ఐలయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మీసాల శంకరుజగ్గానీ కనకయ్య, ఎండి ఖాజా రావనవేని సంపత్, కాంగ్రెస్ నాయకులు గండి రాజేశ్వర్ మూల కృష్ణారెడ్డి, గసికంటి కుమార్, సముద్రాల రమణారావు, వేల్పుల వెంకటేష్ అనంతుల రమేష్ జల్లోజు శ్రీనివాస్ పత్యం రాజేష్, వేముల శ్రీనివాసు, సలీం తిప్పారపు శ్రీనివాస్, కపిల్ మాధవ్,కనకరాజు, వెలిచాల యువసేన జిల్లా అధ్యక్షుడు కాసారపు కిరణ్ కుమార్, గండి గణేష్ ఉపసర్పంచ్ కాశీపాక రాకేష్, సలీం, చిందం శ్రీనివాస్ యువజన కాంగ్రెస్ నాయకుడు కోహెడ వేణు, మీసా రమాదేవి కర్రె పావని, పోరండ్ల రమేష్ సత్తినేని శ్రీకాంత్, 22 ఏ భూ బాధితుల ఐక్యవేదిక అధ్యక్షుడు పాషా మోహన్ రెడ్డి, రేకుర్తి మాజీ ఉపసర్పంచ్ గొల్ల కృష్ణయ్య, సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మంథని జెడ్పిహెచ్ఎస్ బాలుర విద్యార్థుల విద్యా విహారయాత్ర

**మంథని, ఆగస్టు 21 (ప్రజాజ్యోతి):**

నాల్గవ శనివారం నో బ్యాగ్ డే సందర్భంగా మంథని జెడ్పిహెచ్ఎస్ బాలుర విద్యార్థులకు విద్యా విహారయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఖమ్మంపల్లి గ్రామంలో గల చారిత్రక సందరేల్లి గుళ్లను సందర్శించారు. సందరేల్లి ఆలయాల చారిత్రక నేపథ్యం, ప్రాముఖ్యత, విశిష్టత గురించి విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం విద్యార్థులు తాడిచర్ల ఓసిపి గనిని సందర్శించారు. గనుల ప్రాముఖ్యత, బొగ్గు ఉత్పత్తి, దేశ అభివృద్ధిలో గనుల పాత్ర గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. గనిలో ఉపయోగించే డంపర్లు, షవల్స్ పనిచేసే విధానాన్ని విద్యార్థులు ఆసక్తిగా పరిశీలించి ఆనందించారు. తదుపరి మానేరు బ్రిడ్జి వద్ద విద్యార్థులు ఉపాధ్యాయుల సమక్షంలో వంట చేసుకుని, సహపంక్తి భోజనం చేశారు. అనంతరం విద్యార్థులు వివిధ రకాల ఆటలు ఆడి ఉత్సాహంగా, ఆనందంగా గడిపారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు చరిత్ర, గనుల ప్రాధాన్యత, ప్రకృతి, సామాజిక జీవన విధానాలపై ప్రత్యక్ష అవగాహన కలిగింది. పాఠ్యపుస్తకాలకు మాత్రమే పరిమితం కాకుండా, ప్రత్యక్ష అనుభవం ద్వారా నేర్చుకునేలా చేసిన ఈ నో బ్యాగ్ డే కార్యక్రమం విద్యార్థులకు ఎంతో విజ్ఞానదాయకంగా, ఆహ్లాదకరంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మోసం శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు మార్గదర్శనం చేశారు.





# చందుర్తి మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం.. పల్టీ కొట్టిన కారు, మహిళ మృతి

- కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ముగ్గురు..

కరీంనగర్ ఆసుపత్రికి తరలింపు- వేములవాడ ఏరియా ఆసుపత్రిలో ఇద్దరికి చికిత్స.

. క్షతగాత్రుల్లో చిన్నారి



**వేములవాడ,ఆగస్ట్,22:ప్రజా జ్యోతి.**

వేములవాడ నియోజకవర్గం చందుర్తి మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు సభ్యులు కారులో చందుర్తిలో నిర్వహించే హల్దీ వేడుకకు వస్తుండగా లింగంపేట మార్గమధ్యలో కారు అదుపుతప్పి ఒక్కసారిగా పల్టీ కొట్టింది. ఈ తీవ్ర ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒక దుర్మరణం చెందింది.కారు ప్రమాదంలో ఒక చిన్నారితో సహా ఐదుగురు గాయపడగా, వారిని వెంటనే స్థానికుల సహాయంతో వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అయితే వారిలో ముగ్గురి పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో వైద్యాధికారుల సూచన మేరకు మెరుగైన అత్యవసర చికిత్స నిమిత్తం కరీంనగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మిగతా ఇద్దరు క్షతగాత్రులకు వేములవాడ ఏరియా ఆసుపత్రిలోనే చికిత్స అందిస్తున్నారు. వేడుకకు వెళ్తుండగా చోటుచేసుకున్న ఈ ప్రమాదంతో రుద్రంగి, చందుర్తి గ్రామాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# పాత డంప్ యార్డులో చెత్త వేసినందుకు రూ.10,వేల జరిమానా

**మంథని, ఆగస్టు 21 (ప్రజాజ్యోతి):**

మంథని మున్సిపాలిటీ పరిధిలోని పాత డంప్ యార్డులో నిబంధనలకు విరుద్ధంగా చెత్త వేసిన వ్యక్తికి మున్సిపల్ అధికారులు రూ.10 వేల జరిమానా విధించారు. పాత డంప్యార్డ్ బహిరంగ ప్రదేశంలో లారీలు చెత్త తీసుకొని వచ్చి వేయడంతో శనివారం గుర్తించిన మున్సిపల్ కమిషనర్ మనోహర్ జరిమానా విధించారు. మున్సిపల్ పరిధిలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా, నిర్దేశించిన ప్రదేశాల్లోనే చెత్తను వేయాలని అధికారులు సూచించారు. మున్సిపల్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధిస్తామని కమిషనర్ మనోహర్ హెచ్చరించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు మున్సిపాలిటీకి సహకరించాలని కమిషనర్ కోరారు.



# కాకతీయ హైస్కూల్ లో నీటి పొదుపుపై విద్యార్థులకు అవగాహన





**మంథని, ఆగస్టు 21 (ప్రజాజ్యోతి):**

మంథని పట్టణంలోని కాకతీయ హైస్కూల్ లో ఎస్ఎల్ఎం (స్టూడెంట్ లీడ్ మూవ్మెంట్) కార్యక్రమంలో భాగంగా లీడ్ కోఆర్డినేటర్ పావని ఆధ్వర్యంలో నీటిని పొదుపు చేద్దాం భవిష్యత్ తరాలను కాపాడుదాం అనే సందేశంతో పాఠశాలలో విద్యార్థులకు నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, నీటి విలువను తెలుసుకోవడంతో పాటు, నీటిని వృథా చేయకుండా వినియోగించడం, అవసరం లేని సమయంలో కుళాయి లను మూసివేయడం, లీకేజీ లను వెంటనే గుర్తించి సరిచేయడం, వర్షపు నీటిని సంరక్షించడం వంటి అంశాలపై అవగాహన పొందారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా త్రీడి ఆర్టిస్ట్ డి.శివరామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివరామ కృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరం నీటి ప్రతి చుక్క అమూల్యం నీటిని కాపాడితేనే భవిష్యత్తు సురక్షితం, ఇంటి వద్ద, పాఠశాలలో, పరిసర ప్రాంతాల్లో నీటిని బాధ్యతగా వినియోగించాలని విద్యార్థులకు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ నీరు మన జీవనానికి ఆధారం, నీటి వనరులు రోజురోజుకూ తగ్గిపోతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించడం ఎంతో అవసరమన్నారు. నీటిని వృథా చేయకుండా, ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకోవాలని నేటి విద్యార్థులే రేపటి సమాజానికి నాయకులు కాబట్టి, చిన్న వయసు నుంచే నీటి సంరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఎస్ఎల్ఎం కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నీటి పొదుపు పై అవగాహన పెంచుకొని విద్యార్థులు పాఠశాలలోనే కాకుండా తమ ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో కూడా నీటి పొదుపు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. నీటిని కాపాడుదాం భవిష్యత్తును కాపాడుదాం అనే సంకల్పంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# వేములవాడ ఆలయ ఈవో ఆకస్మిక తనిఖీలు: టీటీడీ ఎంక్వయిరీ, గ్యాస్ గోదాం పరిశీలన

## - వసతి బుకింగ్, నగదు లావాదేవీల్లో పారదర్శకత ఉండాలి: ఈవో రమాదేవి

**వేములవాడ,ఆగస్ట్,22:ప్రజాజ్యోతి.**


వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఈవో ఎల్. రమాదేవి టీటీడీ ఎంక్వయిరీ కార్యాలయం, భారత్ గ్యాస్ గోదాంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీటీడీ ఎంక్వయిరీ ఆఫీస్‌లో వసతి బుకింగ్ నగదు, రికార్డులు, రసీదులను పరిశీలించారు. గ్యాస్ గోదాంలో సిలిండర్ల స్టాక్, పంపిణీ రిజిస్టర్లను తనిఖీ చేశారు. నగదు లావాదేవీలు, రికార్డుల నిర్వహణలో పారదర్శకత ఉండాలని ఈవో స్పష్టం చేశారు. సిలిండర్ల నిల్వ వద్ద భద్రతా ప్రమాణాలు పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతి బుకింగ్ సేవలు వేగవంతంగా అందించాలని సిబ్బందిని ఆదేశించారు. తనిఖీల్లో పర్యవేక్షకులు, అరుణ్, రాజేందర్, పీ.ఆర్.ఓ,పెరుక. శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ తిరుపతి పాల్గొన్నారు.

# మున్నూరుకాపుసత్రంఅదనపు గదుల ప్రారంభోత్సవ ఆహ్వానం

## - వ్యవస్థాపక అధ్యక్షులు, కొం డా. దేవయ్య

**వేములవాడ,ఆగస్టు,22:ప్రజాజ్యోతి.**

వేములవాడపట్టణం లోని శ్రీ రాజ రాజేశ్వరి మున్నూరుకాపు సత్రంగత 18సంవత్సరాల క్రితం ప్రారంభించి 14సంవత్సరాలుగా నిర్విరామముగా మున్నూరు కాపుకుల బాంధవుల కుకుల సోదరులకు సేవలు అందించు చున్నాది. ఉదయం 11గంటలకు అదనముగదులు ప్రారంభోత్సవంకేంద్రమంత్రి ,బండి. సంజయ్, ప్రభుత్వవిప్, వేములవాడ ఎమ్మెల్యే, ఆది. శ్రీనివాస్, చేతుల మీదుగా ఆదివారం రోజున ప్రారంభించ బడును. ఉదయం 10గంటలకు, శివకళ్యాణం జరుగును. సత్రం




వ్యవస్థాపక అధ్యక్షులు కొండదేవయ్య మాట్లాడుతూ అందరూ వచ్చి ఆశీర్వదించాలని సకాలంలో హాజరు కావాలని కోరారు.

# కమ్యూనిటీ కాంటాక్ట్‌తో ప్రజలకు భరోసా

## - ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం

## - రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా





**మంథని, ఆగస్టు 22 (ప్రజాజ్యోతి):**

ప్రజలు ఎలాంటి భయం లేకుండా ప్రశాంత వాతావరణంలో జీవించేందుకు భరోసా కల్పించడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని,ప్రజల భద్రత కోసం శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి మంథని డివిజన్ లోని కమాన్ పూర్ మండలం పెంచికల్‌పేట్ గ్రామంలో శనివారం రాత్రి నిర్వహించిన కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ పర్యవేక్షణలో టూ టౌన్ ఇన్స్పెక్టర్లు ప్రసాద్ రావు, లింగమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి అక్రమ రవాణా, నిల్వ, సరఫరాపై ప్రత్యేక నిఘా చేపట్టడంతో పాటు అనుమానాస్పద ప్రాంతాలు, నివాస గృహాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పత్రాలు లేని 70 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ కార్యక్రమానికి హాజరైన పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా గ్రామ ప్రజలతో మాట్లాడి వారి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సీపీ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం పోలీసులు పెట్రోలింగ్ వాహనాలు, బ్లూ కోల్ట్స్‌తో పాటు అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఇతర వనరులను సమర్థవంతంగా వినియోగిస్తున్నారని తెలిపారు. పోలీసుల చట్టపరమైన చర్యలకు, నేరాల నియంత్రణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. గ్రామంలో తమ ప్రాంతంలో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. తమకు తెలిసిన వారు, కుటుంబ సభ్యులు లేదా పరిచయస్తులు ఎవరైనా తప్పు చేసినా, నేరాలకు పాల్పడినా వాటిని దాచిపెట్టకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. నేరాన్ని ప్రారంభ దశలోనే అడ్డుకుంటే భవిష్యత్తులో తలెత్తే పెద్ద సమస్యలను నివారించవచ్చన్నారు.గతంతో పోలిస్తే నేరాల స్వభావంలో మార్పులు వస్తున్నాయని సీపీ పేర్కొన్నారు. ముఖ్యంగా కుటుంబ సభ్యుల మధ్య వివాదాలు, నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి కుటుంబంలో తల్లిదండ్రులు, పిల్లలు పరస్పర అవగాహనతో ఉండాలని సూచించారు. యువత తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కష్టపడి చదవాలని, క్రీడల్లో రాణించాలని సీపీ సూచించారు. తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకుని అందులో ముందుకు సాగి దేశానికి, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. పని లేకుండా చెడు మార్గాల్లోకి వెళ్లడం వల్ల తల్లిదండ్రులతో పాటు సమాజానికి, ప్రభుత్వ యంత్రాంగానికి కూడా ఇబ్బందులు ఎదురవుతాయని హెచ్చరించారు. యువత ఉద్యోగ సాధనకు అవసరమైన శిక్షణ, నైపుణ్యాభివృద్ధికి పోలీసుల తరపున సాధ్యమైనంత సహకారం అందిస్తామని తెలిపారు. అవసరమైతే ఇతర ప్రభుత్వ శాఖల సహకారంతో యువతకు శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. సింగరేణి సంస్థలో అందుబాటులో ఉన్న అవకాశాలను కూడా యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కష్టపడి పనిచేస్తే తప్పకుండా విజయం సాధించవచ్చని, యువత క్రమశిక్షణతో, లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పిలుపునిచ్చారు.ఈ ప్రాంతంలోని సీనియర్ పౌరులు, వివిధ రంగాల్లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను చట్టబద్ధంగా నిర్వహించాలని, చట్టాన్ని గౌరవిస్తూ పోలీసులకు సహకరించాలని సీపీ కోరారు. ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే డయల్-112కు కాల్ చేయాలని లేదా సమీపంలోని పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, గోదావరిఖని టూ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్జలొద్దీన్, గోదావరిఖని సర్కిల్ ఇన్స్పెక్టర్స్ ప్రసాద్ రావు, లింగమూర్తి, కమాన్‌పూర్ ఎస్ఐ ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు కుటుంబానికి అండగా రైతు బీమా

## - చెక్కును అందజేసిన జువ్వాడి నర్సింగరావు

**కోరుట్ల రూరల్, ఆగస్టు 22 (ప్రజా జ్యోతి)**

కోరుట్ల మండలం ధర్మారం గ్రామానికి చెందిన వెల్మల గంగాధర్ తండ్రి ఇటీవల మృతి చెందడంతో, వారి కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న రైతు బీమా పథకం కింద రూ.5 లక్షల చెక్కును జువ్వాడి నర్సింగరావు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు కుటుంబాలకు ఆపద సమయంలో అండగా నిలుస్తూ, వారి కుటుంబాలకు భరోసా కల్పిస్తున్న తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బీమా పథకం ఎంతో అభినందనీయం. రైతు కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించే ఈ పథకం దేశంలోనే ఆదర్శప్రాయమైన సంక్షేమ కార్యక్రమంగా నిలుస్తోంది. రైతు మరణంతో కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించడం ప్రభుత్వానికి రైతుల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం.ఈ కార్యక్రమంలో ధర్మారం సర్పంచ్ దొడ రంజిత్ రెడ్డి, కోరుట్ల మండల అధ్యక్షులు పన్నాల అంజిరెడ్డి, మాజీ అధ్యక్షులు కొంతం రాజం, మాజీ ఎంపీటీసీ సుభాష్ రెడ్డి, బాపురెడ్డి, సాగర్ తదితరులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# నూకపెల్లి మహాధర్నాతోనే దిగివచ్చిన ప్రభుత్వం: రూ.30 కోట్ల నిధుల ప్రకటన

**జగిత్యాల టౌన్, ఆగస్టు 22 (ప్రజా జ్యోతి):**

జగిత్యాల నూకపెల్లి అర్బన్ డబుల్ బెడ్రూం కాలనీలోని 15 ప్రధాన సమస్యల పరిష్కారం కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ జాక్ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాతోనే ప్రభుత్వం దిగి వచ్చిందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మానాల కిషన్ పేర్కొన్నారు. జగిత్యాల ప్రెస్ క్లబ్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 20 రోజుల క్రితం కాలనీవాసులతో కలిసి, రాష్ట్ర చైర్మన్ డా. విశారదన్ మహరాజ్ ఆధ్వర్యంలో నూకపెల్లి వద్ద భారీ మహాధర్నా నిర్వహించామని గుర్తు చేశారు. స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాలనీ సమస్యలపై స్పందించకపోవడంతోనే, తాము ప్రజా ఉద్యమం ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని వివరించారు.ఈ ధర్నా ప్రభావంతోనే హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాలనీ సమస్యలపై దృష్టి సారించారని జాక్ నాయకులు తెలిపారు. కాలనీలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం సుమారు రూ.30 కోట్ల నిధులు మంజూరు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని, ఈ నిధుల ప్రకటన ప్రజా ఉద్యమానికి లభించిన విజయమని వారు అభివర్ణించారు. ఈ సమావేశంలో జగిత్యాల ఇన్‌చార్జి మ్యడాబోయినీ రాజారాం, శివ మహరాజ్, తిరుపతి, ఉపేంద్ర, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# రాజకీయ విమర్శలతో సమస్యలు పరిష్కారం కావు, మంత్రి వ్యాఖ్యలపై బీజేపీ నేతల స్పందన,

**ఎండపల్లి, ఆగస్టు 22, ప్రజా జ్యోతి**

బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వ్యాఖ్యలను బీజేపీ మండల అధ్యక్షుడు రావు హనుమంతరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొమ్ము రాంబాబు ఖండించారు. ఇటీవల గత గురువారం ఎస్సీ ఎస్టీ దివ్యాంగుల సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరీ లక్ష్మణ్ కుమార్ ఒక సందర్భంలో బిజెపి బిఆర్ఎస్ రెండూ ఒకటేనన్న అంశంపై, శనివారం మండల బిజెపి నాయకులు పాత్రికేయ సమావేశం ఏర్పాటు చేశారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రెండు పార్టీలను కలిపి ఒకటే అని ఏ ఆధారంతో అన్నారో మాకు తెలియదు కానీ ,రాజకీయంగా రెండు పార్టీలకు భిన్నమైన సిద్ధాంతాలు, విధానాలు ఉన్నాయని , రెండు ఒకటి ఎలా అవుతాయని,మీరు .ప్రజలకు ఇచ్చిన హామీలు,అలాగే పలు ప్రభుత్వ పథకాలు పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని ,ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిపక్షాలపై ఆరోపణలు చేయడం కంటే నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, మా పార్టీకి కార్యకర్తలే అభ్యర్థులని ,బీజేపీ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతోందని



పేర్కొన్నారు.ప్రజల దృష్టిని మళ్లించేందుకు రాజకీయ ఆరోపణలు చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు.ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షులు రావు హనుమంతరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొమ్ము రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి మంచి కట్ల రవి, మేడిపల్లి రాజశేఖర్, మండల ఉపాధ్యక్షులు గోపనవేని గంగా చలం, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి, మూల ప్రశాంత్ మేడిపల్లి రాజు, జిల్లా నాయకులు తిరుమల్ ప్రమోద్, మండల నాయకులు సట్టా రవిరాజ్ ,ఎస్సీ మోర్చా అధ్యక్షులు దేవి సంతోష్, బూత్ అధ్యక్షులు కొదురుపాక అశోక్, మండల పార్టీ కార్యదర్శి దాసరి మల్లేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు,

# గోడిసెలపేటలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీకి నూతన సారథులు,

**ఎండపల్లి, ఆగస్ట్ 22, ప్రజా జ్యోతి**

మండలంలోని గోడిసెలపేట గ్రామ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా అరికెళ్ల ప్రశాంత్, ఎంఎస్పీ అధ్యక్షుడిగా గజ్జల మల్లయ్యను నియమించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, జగిత్యాల జిల్లా ఇన్‌చార్జి రేణిగుంట్ల సాగర్ సూచనతో ఉమ్మడి వెల్గటూర్ మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు చెన్న కుమారస్వామి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నియామకంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని వారు తెలిపారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థాయిలో సంస్థలను బలోపేతం చేసి, మాదిగల హక్కులు, రిజర్వేషన్లు, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని నూతన అధ్యక్షులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. నూతన, కార్యవర్గాన్ని నాయకులు, కార్యకర్తలు అభినందించారు.



# పేపర్ యూనియన్ ఆధ్వర్యంలో పుట్టినరోజు సందర్భంగా పండ్ల పంపిణీ

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి ఆగస్టు 22 (ప్రజా జ్యోతి)**

రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం జో గాపురం కు చెందిన గాజుల నరేష్  ఎన్ ఆర్ ఐ పుట్టినరోజు సందర్భంగా ఈరోజు గవర్నమెంట్ హాస్పిటల్ లో  ఫ్రూట్స్ పంపిణీ  చేశారు ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా న్యూస్ పేపర్ డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ యూనియన్ అధ్యక్షులు పోచంపల్లి రాజు మాజీ అధ్యక్షులు ఏల్లే రాజేంద్రప్రసాద్ మరియు పేపర్ ఏజెంట్లు వెంగళ శ్రీకాంత్  పిసక సాయి కుమార్ చిట్యాల శ్రీహరి పేపర్ బాయ్స్ ఎల్లె గోపి చరణ్ తదితరులు పాల్గొన్నారు.



# తాళం ఇండ్లే టార్గెట్.. వరుస బైక్ దొంగతనాల ముఠా గుట్టురట్టు!

## - ఐదుగురు నిందితులపై కేసు నమోదు.. నలుగురి అరెస్ట్
## - ఒకరు పరారీ.. ఆటో, బైక్‌లు, బంగారం స్వాధీనం
## - సారంగాపూర్ పోలీసుల చాకచక్యం

**సారంగాపూర్, ఆగస్టు 22 (ప్రజా జ్యోతి):**

తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడటమే కాకుండా, వరుస బైక్ దొంగతనాలతో కలకలం సృష్టిస్తున్న అంతర్జిల్లా దొంగల ముఠా గుట్టును సారంగాపూర్ పోలీసులు రట్టు చేశారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా, మరో నిందితుడు పరారీలో ఉన్నాడు.

**అసలేం జరిగిందంటే..**

ఈ నెల 18న రాత్రి 10:30 గంటల సమయంలో అర్పపల్లి గ్రామంలో ఓ ఇంటి తాళం పగలగొట్టి బీరువాలోని తులం బంగారం చైన్, రూ. 350 దొంగిలించారు. అదే సమయంలో ఇంటి యజమాని రావడంతో దొంగలు తాము వచ్చిన డియో స్కూటీని అక్కడే వదిలేసి పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సారంగాపూర్ ఎస్సై గీత కేసు (క్రైమ్ నెంబర్: 109/2026, సెక్షన్: 331(4), 305 భారతీయ న్యాయ సంహిత) నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**తనిఖీల్లో దొరికిపోయిన దొంగలు:**

ఆగస్టు 21న సాయంత్రం 6:00 గంటల ప్రాంతంలో సారంగాపూర్ పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, రెచ్చపల్లి ఎక్స్ రోడ్ వద్ద బైక్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. అనుమానం వచ్చిన పోలీసులు వారిని వెంటాడి పట్టుకుని విచారించగా అసలు దొంగతనాల ముఠా వ్యవహారం బయటపడింది.




**నిందితుల వివరాలు:**

మొదటి నిందితుడు: ఈనగందుల పవన్ చందు 26, తండ్రి: రమేష్, కులం: పద్మశాలి, నివాసం: గుల్లాపేట గ్రామం, జగిత్యాల రూరల్ ప్రస్తుతం వేములవాడ టెంపుల్ పరిసరాల్లో ఉంటున్నాడు. ఇతనిపై వేములవాడ, సిరిసిల్ల పోలీస్ స్టేషన్లలో 5 గంజాయి కేసులు, 7 దొంగతనం కేసులు ఉన్నాయి.

రెండవ నిందితుడు: ఇంజనపల్లి జగదీశ్వర్ 23, తండ్రి: బాలయ్య, కులం: మాదిగ, నివాసం: ఎంఎస్సీ ఫామ్, ఎడపల్లి మండలం. ఇతనిపై ఇప్పటికే 4 కేసులు ఉన్నాయి.

మూడవ నిందితుడు: అహ్మద్ హుస్సేన్ 58, తండ్రి: మహమ్మద్, ముస్లిం, నివాసం: కరీంనగర్.

నాల్గవ నిందితుడు: కుక్కట్ల సతీష్ 22, తండ్రి: కనకయ్య, నివాసం: రాయకల్ దేవిపల్లి గ్రామం, ఎలిగేడు మండలం, పెద్దపల్లి జిల్లా.

ఐదవ నిందితుడు: పాంచాలి సందీప్, తండ్రి: చంద్రమౌళి, నివాసం: హనుమాన్‌వాడ, జగిత్యాల టౌన్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు.

**ఆరు బైక్‌ల దొంగతనం.. ఆటో కొనుగోలు:**

నిందితులు అర్పపల్లి దొంగతనమే కాకుండా బోయినపల్లి, కొడిమ్యాల, కోనరావుపేట, జగిత్యాల రూరల్, నిజామాబాద్ మండలాలలో మొత్తం ఆరు బైక్‌లను దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. దొంగిలించిన బైక్‌లలో ఒకదానిని మూడవ నిందితుడైన అహ్మద్ హుస్సేన్‌కు అమ్మారు. అతని ద్వారా పరిచయమైన నాల్గవ నిందితుడైన కుక్కట్ల సతీష్‌కు మూడు బైక్‌లను, ఐదవ నిందితుడైన పాంచాలి సందీప్‌కు ఒక బైక్‌ను అమ్మినట్లు తెలిపారు. కాగా, బైక్‌లు అమ్మగా వచ్చిన డబ్బులతో నాల్గవ నిందితుడు కుక్కట్ల సతీష్ వేరొక వ్యక్తి వద్ద ఒక ఆటోను కూడా కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు.పోలీసులు నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని కోర్టులో రిమాండ్ చేశారు. పరారీలో ఉన్న ఐదవ నిందితుడు పాంచాలి సందీప్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# కార్మికుల సమస్యల పరిష్కారంలో ఏఐటీయూసీ ముందంజ

## - ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎశమేని గణేష్‌కు ఎమ్మెల్యే  సన్మానం

**మెట్‌పల్లి, ఆగస్టు 22, ప్రజా జ్యోతి:**

కార్మికుల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ ఎల్లప్పుడూ ముందుండి పోరాటం చేస్తుందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ఇటీవల జరిగిన ఏఐటీయూసీ జగిత్యాల జిల్లా మహాసభల్లో జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ఎశమేని గణేష్, సంయుక్త కార్యదర్శి ఎండి ఉస్మాన్, కౌన్సిల్ సభ్యుడు కాతా వినయ్‌లను శనివారం మెట్‌పల్లి పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే సంజయ్ ఘనంగా సన్మానించారు. వారికి శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ.. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం సంఘటిత పోరాటాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ఎశమేని గణేష్ నాయకత్వంలో జగిత్యాల జిల్లా వ్యాప్తంగా కార్మికుల సమస్యల పరిష్కారానికి మరింత బలంగా కృషి చేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. నూతనంగా ఎన్నికైన ఏఐటీయూసీ నాయకులకు మరోసారి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆకుల ప్రవీణ్, మొరపు చిరంజీవి, వాజీద్, మాజీ కౌన్సిలర్ బంగారుకాళ్ల కిషోర్, జియా, ఏఐటీయూసీ నాయకులు,



కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.